# అస్పృశ్యగంగ

అనంతపురం నుంచి నారాయణపురం పోయే తోవ లోని తపోవనంలో భాగీరథీ అనే ఇల్లు ఉంది. అనంతపురం అనంతమైన పురమూకాదు. అనంతుడి పురమూ కాదు. అనంతమ్మపురం. ప్రస్తుతం అక్కడక్కడా నీటి ఎద్దడి.

నారాయణపురంలో నారాయణుడూ లేడు. నరుడూ లేడు. రైతులు, కష్టజీవులు ఉన్నారు.

భాగీరథీ గంగా కాదు. నీళ్ళూ లేవు. ఆ ఇంట్లో నీళ్ళు కావలసిన నోళ్ళున్నాయి.

పొద్దుకూడేట్లో కుంకుతున్నప్పుడు వినాయక్ తవ్వేబావి అంచున నిలబడి లోపలికి చూడసాగాడు. చూచినకొద్దీ చీకటి పెరుగుతూ ఉంది. పొద్దు కుంకినట్లల్లా చీకటి దట్టమవుతూ ఉంది. లోపల ఏమీ కనిపించలేదు.

ఏమీ కనపడకుండా పోయిందాకా చూచి, వెనుదిరిగిన అతడికళ్ళల్లో తిరిగిన నీళ్ళను కళ్ళే మింగాయి. బావిలో నీళ్ళు పళ్ళేదు.

ఏమీ లేదన్న చోట ఏమయినా దొరుకుతుందేమో అన్న ఆశతో చూచే చూపు వినాయక్‌ది.

చీకటి పడిందని, ఇంట్లోకి రమ్మని చెప్పటానికి వచ్చిన పిల్లలు మౌనంగా ఉన్న తండ్రిని చూచి మాట్లాడకుండా లోనికి పోయారు.

అతను గుండె పట్టుకొన్నాడు. హృదయం భారంగా ఉంది.




మళ్ళీ మళ్ళీ బావిలోకి చూశాడు. ఏముంది కనపడడానికి మట్టి తప్ప. మట్టికాదు బండ. బావిలో బండ పడింది.

బావితవ్వే గోవిందు బండ పడిందని అంతకుముందే చెప్పి వెళ్ళాడు. అయితే ఆశ చావలేదు. గోవిందు నమ్మకం గోవిందుది.

బండ పడిందన్న మాట విన్న వినాయక్ గుండె చెరువయింది. అందులోనూ నీళ్ళు లేవు. మతి లేదు. మాట లేదు. మౌనం.

వినాయక్‌ది పంట ఎండిపోతుందన్న బాధ కాదు. నోళ్ళెండుతాయన్న దిగులు. ఆ ఇల్లు, ఆ కాలనీ మునిసిపాలిటీకి చెందదు. పంపునీళ్ళు రావు. కాలనీలో బావులున్నాయి. వాటి నీళ్ళు వాటి వాళ్ళకేచాలవు. చాలినా వినాయక్‌నుతోడుకోనివ్వరు. తోడుకోనివ్వమనరు. అలా ఉంటారు. పనివాళ్ళు తోడితే రెండో మూడో కడవలు తోడుకోనిస్తారు. అవీ చాలవు. అయినా తోడ దగ్గవాళ్ళు వినాయక్ ఇంట్లో ఎక్కువ కాలం పనిచేయరు. తెలియక చేస్తే చుట్టూ ఉన్న వాళ్ళు తెలియజేస్తారు. నోటితో చెప్పరు. నొసటితో చెబుతారు. వాళ్ళు పని మానుకొంటారు. పనివాళ్ళకేమో దొరుకుతారు. వీళ్ళకు వాళ్ళ బావుల్లో నీళ్ళు తోడే అర్హత ఉండదు. అర్హత ఉన్నవాళ్ళూ దొరుకుతారు. ఎక్కువకాలం ఉండరు.

భాగీరథిలో నీళ్ళకోసం ఆరునోళ్ళున్నాయి. తాగే నీళ్ళే కష్టమయితే వాడే నీళ్ళేలేనిచోట ఉండటం ఎందుకూ వెళ్ళిపోవచ్చు. కానీ పోలేదు. కారణం సొంతిల్లు. జన్మకో శివరాత్రి. తనకంటూ ఎక్కడా ఇల్లులేనివాడికి సొంత ఇల్లు సొట్టదయినా మొఱ్ఱిదయినా తొఱ్ఱిదయినా స్వర్గం. తన ఇల్లు. తన ఇంట్లో తానుండాలి. అంతేకాదు తానక్కడే ఉండాలి. అంతే తన ఇంట్లో తానుండటమన్నది ఒక పోరాటం. అదృశ్య యుద్ధం. తానక్కడే ఉండాలి. అదే తన నిర్ణయం. అదే తన విజయం. అదే తన తాపత్రయం.

తాను కాలేజీ నుంచి, తన భార్య స్కూలు నుంచి వచ్చేసరికి మసకచీకటి ముసురుకొంటుంది. స్కూళ్ళనుంచి పిల్లలు కూడా అలసిపోయి వస్తారు. రెండుమైళ్ళు నడిచి తీరాలి. తనకు సైకిల్ అయినా ఉంది. మిగతావాళ్ళకు లేదు.

తాను పోలేక, భార్యను పంపలేక, పనిమనిషి లేక, పిల్లలకు కడవలు, బిందెలు ఇచ్చి ఎక్కడ నీళ్ళు దొరికితే అక్కణ్ణుంచి తెమ్మని పంపేవాడు వినాయక్. ఒక్కొక్కప్పుడు దొరికేవి. ఒక్కొసారి దొరికేవి కావు. అప్పుడు వాళ్ళు అటు నారాయణపురమో, ఇటు అనంతపురమో పోయి నీళ్ళు తెచ్చేవాళ్ళు. అంత పెద్ద కడవలు బిందెలు బరువుగా వాళ్ళ మోసుకొని రావటం, చదువు బరువుతో అలసిపోయిన పసిప్రాణులు నలిగిపోవటం చూడలేని వినాయక్‌కు సొంతబావి ఇంట్లో తవ్వించుకోవటం తప్పలేదు.

వాళ్ళ జీతాలు అంతంతమాత్రం. అప్పటికింకా జీతాలుపెరగలేదు. భార్యాభర్తలిద్దరికీ ముసలి తల్లితండ్రులున్నారు. వాళ్ళూ పేదవాళ్ళు, పల్లెల్లోనే ఉన్నారు. వాళ్ళకూ ఎంతో కొంత పంపాలి. వాళ్ళు చదువులేనివాళ్ళు, ఆస్తిపాస్తుల్లేవు. పిల్లల్నే సంపదగా పెంచుకున్నారు. వాళ్ళ మీదే ఆధారపడ్డారు. వాళ్ళు పల్లెలు వదల్లేరు. పట్నం రాలేరు. వచ్చి ఉండలేరు.

కలో గంజో పల్లెలోనే చాలంటారు. ఖర్చు తప్పదు. వాళ్ళకు పంపంగా మిగిలింది ఇంటికి సరిపోతుంది. నలుగురు పిల్లలు. ఎక్కొస్తున్నారు. వాళ్ళ చదువులకు డబ్బు ఖర్చు పెరుగుతూ ఉంది. వాళ్ళు పెరుగుతున్నారు. తిండి, బట్టలు, చదువు ఖర్చు పెరుగుతూ ఉంది. కాలం గడిచేకొద్దీ డబ్బు అవస్థగా ఉంది.

దానికి తోడు ఇల్లు కట్టించుకోవటం, దాని ఖర్చు తెచ్చిన అప్పు, నెలనెలా వడ్డీ, మొత్తంమీద డబ్బు కటకటగా ఉంది. ఆ పరిస్థితుల్లో బావి తవ్వించుకోవలసి వచ్చింది. ఖర్చు మీద ఖర్చు. బావిలో బండ పడింది. ఇంక నీళ్లు పడే ఆశ ఎండమావి.

బావిలో నీళ్ళు పడతాయంటాడు గోవిందు. నీళ్ళు పడితే బాగుండునని వినాయక్‌కూ ఆరాటం.

బండపడితే ఏంచేయాలి? వినాయక్ అడుగుతున్నాడు. గోవిందు చెబుతున్నాడు. ఎందుకయినా డబ్బు కావాలి. తూటాలు పెట్టి పేలిస్తే బావిలో నీళ్ళు పడతాయని నలుగురూ అన్నారు. బోరు వేయించినా మేలే అన్నారు. అదైనా ఖర్చే! ఇదైనా ఖర్చే! అంత డబ్బు ఖర్చు చేయలేని పరిస్థితి వచ్చింది. తాత్కాలికంగా బావి పని ఆపాడువినాయక్. పిల్లలకు నీళ్ళు మోసే బరువు తప్పదు.

పదిమంది పదిరకాలుగా చెప్పారు. నీళ్ళు లేని బావి, అదే గుంటను పూడ్చమన్నారు. అదొక ఖర్చు.

పిల్లలు తిరిగే చోటు దానిమీద మూత వేయించమన్నారు. లేదా కాంపౌండు గోడ కట్టమన్నారు. కాదంటే బండలు పాతమన్నారు. అదీ ఖర్చే.

కొండలా పెరిగిన తవ్వకం మట్టిమీద పిల్లలు చేరి జారుతుంటే ఆ ఊపులో వచ్చి వాళ్ళు నీళ్ళులేని బండ బడ్డ బావిలో పడితే లేనిపోని చాందనీ భార్యాభర్తలిద్దరూ హడలి చస్తున్నారు. తమ పిల్లల్ని ఆపుతున్నారు. కాలనీ పిల్లల్ని ఆపటం వాళ్ళ తరమా? రోజంతా ఇంట్లో ఎవరూ ఉండరు. అప్పుడేమయినా పిల్లలకు జరిగితే? అదొక పోటు. తలనొప్పి.

దాన్నిపూడవనయినా పూడవాలి. లేదంటే తూటాలు పెట్టి బండయినా పగలగొట్టాలి. ఎందుకయినా డబ్బుకావాలి. అదీ పెద్ద సమస్య. బావి దగ్గర తలపట్టుకొని నిలబడ్డ వినాయక్‌ను భాగీరథి వచ్చి ఇంట్లోకి తీసుకొని పోయింది.

ఆమె గోల ఆమెది. అందులో నీళ్ళు పడతాయో లేదో, బండ పగులుతుందో లేదో పగిలినా నీళ్ళున్నాయో లేదో. వాటర్ డివైనర్ రాలేదు. చూడలేదు. తవ్వమనిచెప్పలేదు. వినాయక్‌కు తోడు గోవిందు. ఇద్దరూ కూడబలుక్కొన్నారు. ఇక్కడంటే ఇక్కడనుకొని తవ్వారు.

ఏమయింది? నీళ్ళుపళ్లేదు. బావి వాస్తు బాగాలేదు. అదొక సొద్ది.

అన్నింటికి మించి పూజ చేయించలేదు. పురోహితుణ్ణి పిలవలేదు. దక్షిణలివ్వలేదు. అయ్యవారికి దండం పెట్టుకోలేదు. బావి విషయమే కాదు. గృహప్రవేశమూ అంతే! ఎవరినీ పిలవలేదు. అన్నం పెట్టలేదు. కనీసం ఫలాహారం అయినా ఫరవాలేదు. పూజా పునస్కారాలు సరేసరి.

పాలుపొంగించి బ్రూ కలుపుకొని నలుగురూ తాగి తోవన వస్తూ పోతూ ఉన్నవాళ్ళకు ఇంత ఇచ్చారు. తాగే వాళ్ళు తాగారు. తాగనివాళ్ళు తాగలేదు. తాగమని చెప్పకుండా తాగకుండా వెళ్ళిపోయినవాళ్ళు చాకచక్యం చారిత్రకమయింది.

ఆచారాలు, సంప్రదాయాలు, పద్ధతులు, పూజా పునస్కారాలు రీతులు రివాజులు లేని మనిషి పని ఇంతేనని ఆడిపోసుకోవటం వినాయక్ వినకపోలేదు. పట్టించుకోలేదు. కానీ అన్నింటా అనుకూలవతి అయిన భార్య లోపల్లోపల కుమిలిపోవటం అతను గమనించకపోలేదు.

భూదేవి తల్లివంటిది. తల్లి అన్నం పెడుతుంది. ఇల్లు ఇస్తుంది. నీళ్ళిస్తుంది. పంట ఇస్తుంది. బ్రతుకు ఇస్తుంది. తల్లికి కొడుక్కు మధ్య దళారులెందుకుని అందుకే గృహప్రవేశంలో దళారులు లేరు. బావి తవ్వకంలో దళారులు లేరు. పూజ పేరుతో సోమరుల్ని ప్రోత్సహించటం వినాయక్‌కు ఇష్టం లేదు.

భాగీరథి మౌనంగా వింటూ ఉంది.

భూమి తల్లి. తల్లి తనువు ఎక్కడ గిల్లినా నెత్తురువస్తుంది. ఆ నెత్తురు ఈనీరు. ఈ బావులు ఈ పాతాళగంగలు. ఎముకమీద పొగిచినా నెత్తురు రాకపోవచ్చు.అరిచేతిలోనో, అరికాలిలోనో గిల్లితే నెత్తురు కారకపోవచ్చు. అంతమాత్రాన తల్లి శరీరంలో నెత్తురు లేదనటం కుదరదు. తల్లి దయమాలి ఉండదు. బిడ్డ దాహబాధ మాన్పక మానదు. సంఘంలో పరాభవింపబడే కొడుకును చంక నెత్తుకోక తప్పదు. ఎవరికీ ఏద్రోహమూ చేయకపోయినా హింసించే లోకం లాగా కాక అక్కున చేర్చుకొంటుంది. ఆదరిస్తుంది. భయపడనక్కరలేదు. బండ పగులుతుంది. బావిలో నీరు పడుతుంది. బావిలో నీరుపడకూడనంత ద్రోహం తానెవరికీ చేయలేదు.

భార్య ఊపిరిబిగబట్టి వింటూ ఉంది.

పూజ చేయించకపోవటమే బావిలో నీళ్ళుపడకుండా బండపడటానికి కారణమంటే హేతువు అంగీకరించదు. ఇద్దరికీ ఉద్యోగులు రావటానికి. పిల్లలు కలగటానికి పూజలు

లేకపోయినా కరుణించిన శక్తి బావిలో నీళ్ళు పడకుండా చేయదు.

భార్య తల ఊపింది.

కాలనీలో మనకు నీళ్ళు పుట్టకపోవటానికి మనం కారణం కాదు. మనగతం. జాతి గతం. భారతీయత గతం. మనం ఇప్పుడు వేల పూజలుచేసినా మనకీ కాలనీలో నీళ్ళు పుట్టవు. బావిలో పుడతాయి. ప్రయత్నించాలి. అంతే.

భాగీరథి భర్తచేయిపట్టుకొని లోపలకి తీసుకుపోయింది.

బావిలో బండపడడం నిజంగా దురదృష్టమే. పూజ చేయించి, వాస్తుచూపించి తవ్వినా పడే బండ పడవే పడుతుంది. మనకున్న స్థలం ఈ కొంచెమే. ఇందులో ఎక్కడ తవ్వినా బండ ఉండే ఉండవచ్చు. మరోచోట మనం బావికోసం స్థలం కొనలేం. తవ్వించలేం. మనస్థలంలో ఈ బావికింద ఉన్న బండ చీలి నీళ్ళు రావలిసిందే. రెండు బండల మధ్య జల నిరంతరం ఉంటుందంటారు. ఆ బావి ఎండిపోదు. వొట్టిపోదు. నీటిఎద్దడి ఉండదు. అనుభవం ఉన్న గోవిందు బండల మధ్య గంగాభవానీ ఉందంటాడు. అతడి మాట మీద నాకు అవిశ్వాసం లేదు. కష్టజీవి. అమాయకుడు. కల్లాకపటం లేనివాడు. పేదవాడు. గంగను నమ్ముకొన్నవాడు. బావులు తవ్వటమే అతడి జీవితం. నీళ్ళు లేనిచోట తవ్వుకొంటూ పోడు. మోసం చేయడు. గంగఅతణ్ణి మోసం చేయదు.

అన్నం వడ్డించేదా? 'అంది భార్య.' 'సరే' అన్నాడు. ఆరుగురూ కూర్చున్నారు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. తండ్రి దిగులుగా ఉన్నాడని పిల్లలు మౌనంగా వున్నారు. భాగీరథి వడ్డిస్తూ ఉంది. అందరూ మౌనంగా ఉండేసరికి వాతావరణం వేడెక్కింది. మౌనం పారిపోగొట్టటానికి వినాయక్ కల్పించుకున్నాడు. స్కూలు సంగతులు, ఆటలు, పాటలు, పోటీలు, మార్కులు మాయాజాలంలో పడ్డ పిల్లలు వస పిట్టల్లా ఒకటే కబుర్లు.

కోకిల కొసురు కూతలకంటే, బృహదీశ్వరాలయంలో పొద్దుటా,సాయంకాలం లౌడ్‌స్పీకర్‌లో వినిపించే గీతోపదేశంకంటే, ఇష్టమైన జానపద గీతం కంటే పిల్లలు మాటలు తండ్రి చెవులకు విందు చేశాయి. వాళ్ళ మౌనం అతడికి నరకం. వాళ్ళ మాటలు స్వర్గం. వినాయక్ ఎప్పుడూ స్వర్గ సుఖాలే కోరుకొనేవాడు.

పిల్లలు అన్నం తింటున్నారు. వాళ్ళ మాటల్లో వాళ్ళున్నారు. వినాయక్ వాళ్ళ మాటలు వింటూ అన్నం అంటుకొంటూ ఉన్నాడు. వాళ్ళ మాటల రుచిలో అతను నెమ్మదిగా తనలోకి తాను వెళ్ళిపోయాడు.

రెండేళ్ళక్రితం తనకు చాలా పెద్ద కష్టం వచ్చింది. మంచం పట్టాడు. రెండు నెలలు

లేవలేదు. నరకం అంటే ఏంటో తెలిసి వచ్చింది. ఇంట్లో తాను ఒంటరిగా ఉండేవాడు. మంచంలోంచి లేవలేదు. అదీ మంచంలోనే పనిచేసే మనిషి లేదు. భార్య స్కూలు మానటానికి వీలు లేదు. ఆమెతో పిల్లలూ మానేస్తారు. పిల్లల చదువుకు ఆటంకం కలగరాదు. వాళ్ళు బాగా చదువుకోవాలి. తమకంటే మంచి ఉద్యోగాలు సంపాదించాలి. చదువు లేకపోతే, ఉద్యోగులు లేకపోతే వాళ్ళ జీవితం దుర్భరంగా ఉంటుంది. తమకు ఆస్తిపాస్తులు లేవు. పొలం పుట్రాలేవు. నగానట్రా లేవు. బాగా బతకాలంటే చదువుకోవాలి.

ఇలాగే ఈ మంచం మీదే వీళ్ళైన స్కూలునుంచి రాకముందే తాను చనిపోతే ఏమవుతుంది? ఏడుస్తారు. వల్లకాటికి అప్పులిస్తారు. అంతేనా? అంతే అయితే ఫరవాలేదు. ఈ అయిదుగురూ ఏమవుతారు? ఎవరాదుకొంటారు? ఆమెతల్లితండ్రులు చేరదీయరు. బంధువుల రానివ్వరు. తన వాళ్లూ రానివ్వరు. రానిచ్చినా వాళ్ళకేముంది? వీళ్ళకేం పెడతారు ఎలా బ్రతుకుతారు. వీళ్ళకంటే ముందువాళ్ళు హరీ అంటారు. వాళ్లు వయస్సు మళ్ళినవాళ్ళు. పోయినా న్యాయమే. ఇంకా కళ్ళు తెరవని నీళ్ళు. పసిగుడ్లు. లోకమంతా ముందున్నవాళ్ళు.

వినాయక్ ఆమెను ప్రేమించి పెళ్ళాడాడు. కులం మతం చూసుకోకుండా పెళ్ళి చేసుకొన్నాడు. అమ్మానాన్న వద్దన్నా అత్తా మామలు బెదిరించినా పట్టించుకోలేదు. ఆమెకూడా అంతే తెగువ చూపించింది. వాళ్ళెవళ్ళు తన దగ్గరకు రారు. తమను రానివ్వరు. డబ్బుపంపితే తీసుకొంటారు. అది అభ్యంతరం లేదు. అది వాళ్ళ హక్కు. వాళ్ళ అవసరం. కొడుకుగానీ,కూతురు గానీ పెళ్ళిచేసుకోవటం వాళ్ళ కంత అభ్యంతరం కాకపోయినా లోకం కోసం. ఊరూవాడా కోసం. జనంకోసం హడలెత్తి చస్తుంటారు. ఇష్టమున్నా ఉన్నట్లు కనిపించరు.వాళ్ళ వల్ల లాభం లేదు. వాళ్ళేమీ ఆదుకోలేదు. తాము సుఖంగా ఉంటే వాళ్ళూ సుఖంగా ఉంటారు. లేకపోతే వాళ్ళూ కష్టపడతారు. తాను లేకపోతే వాళ్ళకూ వీళ్ళకూ కష్టం.

తనకేమన్నా అయితే తన భార్యాపిల్లలు గతేమిటన్న ఆందోళన వినాయక్‌కు నిజంగా ఆయువుపోసింది. తాను పోయినా ఆమెకుఉద్యోగం ఉంటుంది. ఉండటానికి ఇల్లుంటే ఎంతబాగుంటుంది. ఎవరి పంచనా చేరవలసిన గతి పట్టదు. అప్పుడే ఆరాటం మొదల యింది. సొంత ఇల్లు ఎంత చిన్నదయినా ఫర్వాలేదు. ఉండాలి. ఈ ఆందోళన ఆరాటం, అతణ్ణి బతికించాయి. బతికి బట్టకట్టిన నాటి నుంచి సొంత ఇల్లు అతడి ఊపిరి అయిపోయింది.

పిల్లలు ఏమేమి కబుర్లు చెప్పారో అతను వినలేదు. ఎప్పుడు అన్నం తిన్నారో చూడలేదు. ఎప్పుడు పుస్తకాలు పుచ్చుకొని కూర్చున్నారో గమనించలేదు. తన గతంలో తాను

కూరుకుపోయాడు. భార్య భోజనం  ప్లేట్లు తీసి శుభ్రం చేస్తున్నప్పుడు తానులోకంలోకి వచ్చాడు.

పేపర్లు దిద్దుతూ కూర్చున్న భార్యముఖంలోకి చూస్తూ నా మూలంగా నీకన్ని కష్టాలూ అన్నట్లుగా ఉన్నాడు. మీ మూలంగా నాకీ ఆనందం అన్నట్లుగా ఆమె దిద్దిన ప్రశ్నపత్రాలు భర్తకు అందించింది.

వినాయక్ ప్రభుత్వ కళాశాలలో లెక్చరరు. ఆమె యల్లార్జిలో టీచరు. పిల్లలిద్దరు రామచంద్రనగరు మిస్సమ్మ స్కూలులో మూడూ నాలుగు. పెద్దవాళ్ళిద్దరూ యల్లార్జీలో ఆరూ,ఏడూ. తల్లితో పోయి వస్తారు. సెకండురోడ్డు మసీదు దగ్గర బస్సెక్కుతారు. అక్కడే దిగుతారు. అక్కణ్ణుంచి తపోవనం నడచివస్తారు. చిన్నవాళ్ళిద్దరూ ఖాదరు రిక్షాలో స్కూలుకుపోయి రిక్షాలోనే వస్తారు. పొద్దుట ఇల్లు వదలిన వాళ్ళు సాయంకాలానికి ఇంటికి చేరతారు. స్కూలులోనే తిండీ తీర్థం. వాళ్ళు స్కూలులో కడుపునిండా నీళ్ళు తాగుతారు. కేరియర్‌లోనీళ్ళు తెచ్చుకుంటారు. ఇంటి దగ్గర నీటి విషయంలో ఏరోజు పరిస్థితి  ఎలా ఉంటుందో చెప్పటం కష్టం. ఇంటినుంచి అందరినీ బయలుదేరదీసి, తాను కాలేజీకి వెళ్ళి సాయంకాలం అందరికంటే ముందుగా ఇంటికి వచ్చి అందరినీ ఆహ్వానిస్తూ ఉండేవాడు వినాయక్.

భార్యాభర్తలు నెలకింత జీతం తెచ్చుకొంటున్నారు. వాళ్ళకు పెద్దగా కష్టాలు లేవు. సొంత ఇంటి సొదవాళ్ళ గుండెల్ని వేదిక చేసుకొని కూర్చుండి ఉండకపోతే వాళ్ళు బాగానే బతుకీడ్చుకొని వస్తూ ఉండేవాళ్ళు. ఇంటిపని పెట్టుకున్నారు. అన్నీకష్టాలే. అప్పులు చేయవలసి వచ్చింది. అంతటితో ఆపలేదు. బావిపని ఒకటే. అది కొరకరాని కొయ్యలాగా తయారయింది.

'నేను మంచంబైటేసుకొంటా' అన్నాడు. వినాయక్ 'మీ ఇష్టం' అంది. మంచు దిండూ దుప్పటి తీసుకుపోయి బావి దగ్గరగా వేసుకొన్నాడు. లోనికి వచ్చి, నీళ్ళుతాగి, పిల్లల్ని పలకరించి పడుకోమనిచెప్పి, ముద్దులుపెట్టి వెలుపలికి వచ్చాడోలేదో, వాళ్ళు బిలబిలమంటూ సంచులు సరిది, మంచాలెక్కికబుర్లు చెప్పుకోవటం ప్రారంభమయింది. నిద్ర పొండని చెప్పి లైటుతీసేసి తలుపులు వేసి, నీళ్ళ చెంబుతో భాగీరథీ భర్తమంచం దగ్గరకు వచ్చి తల దగ్గర పెట్టి, కూర్చుంది. ఎవరూ ఏమీ మాట్లాడుకోలేదు. మౌనంగా ఉన్నారు. మౌన మహాసముద్రాలు రెండు, కష్టాలు చెలియలి కట్టలకు తలలు అలలై కొట్టుకొంటున్నాయి.

ఉన్నట్లుండి 'పోయి పడుకో' అన్నాడు. 'పోతాను' అంది. 'ఎక్కువగా ఆలోచించవద్దు' . అంది 'బుర్రపాడుచేసుకోవద్దు.' అంది.సరేలేఅన్నాడు. ఆమె లోపలికి పోయి తలుపు గడియ వేసుకొంది.

జరిగేది జరిగితీరుతుంది అనుకొన్నాడు. అలా అనుకోవటం ఆనందంగా అనిపించింది. ఆనందం వల్ల పడుకోలేకపోయాడు. లేచికూర్చున్నాడు.

రాత్రి పదయింది. మొదటి ఆట సినిమా చూచి వచ్చే వాళ్ళ రిక్షాల బెల్లులు రెండూ మూడు వినిపించాయి. కాలనీకి ఇంకా వీధి లైట్లు రాలేదు.అలికిడి అయితే కుక్కలు అరుస్తున్నాయి. జాగ్రత్త పరులు 'ఎవరూ' అంటూహెచ్చరిస్తున్నారు. రిక్షాల లైట్లు కదలికలు సృష్టిస్తున్నాయి. తపోవనం నిద్రలోకి జారుకొంది. ఏ ఇంటిలో పెద్దగా లైట్లు లేవు. సినిమా చూచి వచ్చిన వాళ్ళు మాత్రం తలుపులు తీయటం లైట్లు వేయటం అక్కడింత ఇక్కడింత వెలుతురు. అన్నీ మట్టిరోడ్లు. పెద్దగా శబ్దం లేదు. దాదాపు నిశ్శబ్దం అలముకొంది. అప్పుడప్పుడూ ఆచార్యుల దగ్గు ఒకటి నిశ్శబ్ద నిశీథికి చైతన్య వైతాళిక స్వరం. అంత నిశ్శబ్దంలో ఆ అనారోగ్య స్వరంఎంత ఆరోగ్యంగా సుస్వరంగా వినవస్తుందో.

తపోవనం విశాలమైన బయలులో పుట్టింది. ఎటుచూచినా మైళ్ళ పొడుగునా అఖండంగా  బయలు. కనుచూపు మేర భారీ ఖాళీ భూములు. ఆ ఖాళీ ప్రదేశమంతా శూన్యం. నిశ్శబ్దం. సంచారం ఏమీ ఉండదు. ఇల్లు, ఇంటి పక్క ఇల్లు. చెట్లు లేవు. కదలికలేదు. అఖండమైన శూన్యం. నిశ్శబ్దం. ఎటుచూచినా చెట్టు లేదు. పుట్టలేదు.పైరు లేదు. పంట లేదు. నీరు లేదు. తడి లేదు.అఖండమైన విరామం.

నారాయణపురానికి పోయే వాళ్ళు అప్పుడొకరిద్దరు. ఇప్పుడొకరిద్దరు పోతున్నారు. కాళ్ళు నేలకు తాటిస్తూ చప్పట్లు కొట్టుకొంటూ ఆడుతూ పాడుతూ వెళుతున్నారు. ఈ శబ్దాలకు పురుగూ పుట్రా తప్పుకొంటాయని వాళ్ళ అభిప్రాయం. మనుషులంటే వాటికి భయం. అవంటే మనుషులకు భయం. కాలనీ ఏర్పడ్డాక పాములు, తేళ్ళు కనిపించటం తగ్గింది. మొదట్లో విపరీతంగా కనిపించేవి. ఈ మనుషులతో మనకెందుకనుకొని అవి దూరంగా పోయాయి.

పొలంలో పంటలు పండటం తగ్గాక పాములు, తేళ్ళు ఆ పొల్లాల్లో విపరీతంగా పుట్టి పెరిగాయి. ఏ రాయి కదిపినా, తేలోతేలుపిల్లో, పాంపిల్లో, మండ్రగబ్బో పకపకలాడేవి.పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అవీ పరారయ్యాయి. మకాం మార్చాయి. తామున్న చోటుకు మనుషులు వచ్చి ఉండడం వల్ల వాళ్ళ ముఖాలు చూస్తూఉండలేక అవి దూరంగా

వెళ్ళిపోయాయి. కాలనీ ఏర్పడ్డాక నారాయణపురం పోవాలంటే రాత్రిపూట భయం లేదు. మునుపు మొదటి ఆట చూచినవాళ్ళు రెండో ఆటకూడా చూచి, తెల్లారిన తరువాతే వచ్చేవాళ్ళు. ఇప్పుడాభయం లేదు. సైకిళ్ళ మీద బళ్ళమీద వచ్చే వాళ్ళకీ కష్టం లేదు. నడిచేవాళ్ళకే సమస్య. ఇప్పుడు సినిమాకుపోయి రావటం పిల్లాట అయిపోయింది. పురుగూపుట్రా ప్రమాదం తప్పిందికానీ, భయం పోలేదు.

తెల్లవారు జామునే నారాయణపురం నుంచి పాలుపెరుగు అనంతపురం తీసుకొని పోయేవాళ్ళ రద్దీ పెరుగుతుంది. మొత్తంమీద శూన్యనిశ్శబ్దంగా ఉండేచోట చలన శబ్దం వినపడసాగింది. తపోవనంలో సూర్యగీతం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకొని, సూర్యోదయంతో నిద్రమేల్కొనే పరిస్థితి ఏర్పడింది.రాత్రిపూట ఎంత శబ్దంలో కూడా నిశ్శబ్దమే రాజ్యమేలుతూ ఉంది.

జూన్ మొదట వారంలో అనంతపురంలో వర్షాలు ప్రారంభమవుతాయి. మేనెలలోనే బావి పని పూర్తి కావాలి. నీళ్ళు పడినతరువాత గోడ కట్టడం గిలకనేయటం అంతా రెండు వారాల పని ఉంటుంది. మేలోఎండలెక్కువ. ఏప్రిలు నెలలోనే తవ్వకం పని అయిపోవాలి. అందుకే వినాయక్ ఒక నిర్ణయానికి వచ్చాడు. బావి పనికి మళ్ళీ పూనుకోక తప్పదు. అప్పు చేశాడు. అప్పులో అప్పు కొత్తప్పు. పాతప్పు మాటలేదు. కావలసినంత అప్పు చేశాడు. గోవిందు చెప్పి వచ్చాడు. తెల్లవారుజామునుంచి మళ్ళీ పని మొదలు. పాతికెకరాల తరికి, తోటకు సరిపడే నీళ్ళుండే బావి ఎండిపోయింది. నాలుగునిలువుల బావి.మోకాలిలోతు బావి అయింది. బావిలో బోరు వేస్తే మొలలోతు నీళ్ళు వచ్చాయి. అవీ ఎంతో కాలం నిలవలేదు.

ఆ రోజుల్లో అక్కడ చీనీ తోట ఉండేది. విపరీతమయిన పంట. వరి మడి కూడా ఉండేది.మంచి దిగుబడి మంచి రాబడి. ఆరుగాలం పంట అదనులో పంట. సెనక్కాయ బాగా పండేది.మంచి ఔటను వచ్చేది. పాతికెకరాలకుసరిపడే నీరు. పదెకరాలకు రెండెకరాలకు సరిపోతూ వచ్చి. చివరకు మోటబావి వెల్లకిల పడి బొడ్డు చూపిస్తే ఏంచేయాలి. చెమ్మలేదు. చేను ఎండిపోయింది. తడిలేదు. చీనీ చెట్లు బాగా బతికి ఆశలొదులు కొని,అవులించి, కళ్ళు తేలేసి,నేలకొరిగి వట్టి కట్టెలయ్యేయి. గొర్లు మేపే వాళ్ళు కూడా రావటం లేదు. పుల్ల లేరుకొని పోయినవాళ్ళు పోగా చెట్లు కొట్టేశారు. మోట పీకేశారు. ఎద్లు అమ్మేశారు. జీతగాణ్ణి పంపించారు. పొలం వదిలేశారు. మిషను పీకేశారు. మిషను గది పాడుపడింది. పొలం ఆసామి అనంతపురం చేరాడు.

ఒకనాటి తోట, మరోనాటి నుండి ఆపైన చేను పాతికెకరాల నిక్షేపం లాంటి భూదేవిని నారాయణప్ప అమ్మకానికో ఆయకానికో అప్పగించచూశాడు. ఎవరూ ఆయకం పెట్టుకోలేదు. అమ్మకం తప్పలేదు. నారాయణప్పకు ఇద్దరు కొడుకులు ఇద్దరూ చదువుకొన్నారు. ఉద్యోగాలు చేశారు. పెద్దాయన ఇంజనీరింగు కాలేజీలో ప్రొఫెసరు. పొలం పని చూచుకోలేడు. చిన్నాయన హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నాడు. పొలం పని ఎవరికీ పట్టలేదు. దానికితోడు మోటబావి ఎండిపోయింది. ఇంకేమీ వ్యవసాయం. జీతగాళ్ళు లేరు. ఇకచేను ఎలాగయినా వదలించుకోవటం. వచ్చినకాడికి రాబట్టుకోవటం తప్పదు.

చెన్నారెడ్డి చురుకైన మనిషి. ఇటుకబట్టీ నడిపి అంతో ఇంతో ఆర్జించాడు. అమ్మకానికి వచ్చిన చేనుకొన్నాడు. లెక్క మాట్లాడుకొన్నారు. కొంత ఇచ్చాడు. కొంత ఇస్తానన్నాడు. రిజిస్టరు అయింది. పొలం చేతులు మారింది. పంట పెట్టాడు. ప్రయోజనం లేదు. బావి మొరాయించింది. వాన కలిసి రాలేదు. పంట లేదు.

అనంతపురం చుట్టుపక్కల వర్షాలు లేక నదులెండి, కాలవలెండి, చెరువులెండి, రైతులు బావుల మీద ఆధారపడ్డారు. బావులెండి, రిగ్గులేస్తే, రెండు మూడేళ్ళకు అవీ ఎండిపోసాగాయి. రైతుల వ్యవసాయం దైవాధీనం అయిపోయింది. వానవల్ల వచ్చే పంట కూడా పదేళ్ళు ఏకబిగిని లేకపోయే సరికి చెన్నారెడ్డికి తలనొప్పి వచ్చింది. చెన్నారెడ్డి కూడా చేనును వదిలించుకొనే మార్గం వెదకసాగాడు.

ఈ పాతికెకరాలు అటు నారాయణపురానికి ఇటు అనంతపురానికి మధ్యలో ఉండడంతో దాన్ని ఇళ్ళ స్థలాలుగా ప్లాట్లు వేయటం ఉత్తమమని ఊహించాడు. రాళ్ళు తొలించాడు. గుళ్ళు పొలించాడు. గీతలు గీయించాడు. సోలుపులు తవ్వించాడు. ప్లాట్లు వేయించాడు. పంచాయతీ ప్లాను అప్రూవు చేయించాడు. అమ్మకానికి సిద్ధం చేశాడు.

చాలాకాలంగా అనంతపురంలో తమ మిషన్ పేరిట ఒక కాలనీ ఉండాలని చిన్నయ్య మిషన్ ప్రయత్నం చేస్తూ వచ్చింది. దానికి తపోవన ప్రసాద్‌పేరిట తపోవనం అని నామకరణం చేశారు. మొత్తం ప్లాట్లు అన్నీ ఒప్పుదల చేసుకొన్నారు. అసలు రేటుకే కొన్నారు.లాభం వేసుకోలేదు. అయినా మిన్నులు పడ్డచోట ఇళ్ళ స్థలమేమిటి, ఇళ్ళేమిటని ఎవరూ సిద్ధం కాలేదు. దాన్ని అధ్యాపకులకు మాత్రమే అని ప్రకటించారు. సాంఘిక సేవా సంస్థ ఇల్లు కట్టుకోడానికి సహాయం కూడా చేస్తుందని ప్రకటించింది. ఫాదర్ ఫెర్రర్ తోడ్పాటు కలిసి వచ్చింది.అప్పుడు అనంతపురంలోని చిన్నా చితకా అయ్యవార్లు దగ్గర్నుంచి కాలేజీ లెక్చరర్ల దాకా ఈ కాలనీలో ఇల్లుకోరుకొనే వాళ్ళు రోజు రోజుకూ పెరిగిపోసాగారు.

ఆ పరిస్థితుల్లో టీచరయిన భాగీరథి,లెక్చరరు అయిన వినాయక్ తపోవనంలో స్థలం ఇల్లు సొంతదార్లు కాగలిగారు. స్వలాభం లేకుండా సేవా దృష్టితో చిన్మయ మిషన్, రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్టు సేవతో కాలనీ ఏర్పడినా, చేసినఅప్పు తడిసి మోపడయింది.

అధ్యాపకులు కాలనీ తపోవనంలో నూటముప్పై ఇళ్లు. అందులో నూరు బ్రాహ్మణులవి. పాతిక వైశ్యులవి. నాలుగు శూద్రులవి. ఒక్కటే వినాయక్‌ది. మనం ఒక్కళ్ళం ఇక్కడ ఉండగలమా? వీళ్ళ మధ్య బ్రతకగలమా అన్నది భాగీరథి సందేహం.

'బ్రతగ్గలం.' అదీ సమాధానం బ్రతికి తీరాల' అదీ పట్టుదల. 'నువ్వు వీళ్లతో కలిసి బతకగలిగినదానివి' 'అదీ భరోసా' 'నేనొక్కణ్ణే కాని వాణ్ణి' అదే సంజాయిషీ. కానీ ఫరవాలేదు. అదీ విశ్వాసం.

వీళ్ళ మధ్య మన పిల్లలుపెరగాలి. వీళ్ళ శక్తి యుక్తులు తెలియాలి. వీళ్ళ మంచి చెడ్డలు అర్థం కావాలి. వీళ్ళతో సమానులుగా సంచరించాలి. నా వల్ల వీళ్ళకు సాంఘిక న్యూనతా భావం రాకూడదు. సాధ్యమయితే వీళ్ళకంటే గొప్పవాళ్ళం అనుకోగలగాలి. అందరూ అనుకొనేట్లు చేయగలగాలి. వీళ్ళతో స్పర్థ మంచిది. విద్యావృద్ధి ఉంటుంది. పిల్లల భవిష్యత్తు బాగుంటుంది. ఈ ఇల్లు నీకు భద్రతా భావం. నేనునీకు అండ. మనం ఇక్కడే ఉంటాం. క్షణం ఆగిపోయాడు. 'ఈ మధ్యలో కొన్ని చిక్కులు వస్తాయి. వాటిని మనం ఎదుర్కొంటాం.' ఆవిధంగా వాళ్ళకు తపోవనంలో ఇల్లు ఏర్పడింది. చేరారు. సంసారం చేస్తున్నారు. కాలనీలో వచ్చిన ఒక చిక్కు. నీళ్ళు ! బావి అవసరం. ఆవిధంగా ఏర్పడింది.

మంచం మీద నిద్ర పట్టక దొర్లుతున్న వినాయక్ బావి వైపుచూశాడు. ఏమీ కనిపించలేదు.ఏమీ కనిపించదు. అయినా చూశాడు. శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు. మట్టిగుట్ట ధైర్యంగా కొండలాగా అండగా ఉంది. బావిలో బండ పడితే బతుకుబండ బారిపోయినట్లు బాధపడడం వల్ల ప్రయోజనం లేదని లేచి కూర్చున్నాడు.

ఆకాశం నిర్మలంగా ఉంది. నక్షత్రాలు మినుకుమినుకు మంటున్నాయి. రేపూ సూర్యోదయం అవుతుందని. ఈ నక్షత్రాలే హామీ ఇస్తున్నాయి. ఇప్పటి ఈ చీకటి ఇలాగ్గే ఉండదని అనిపించిన వెంటనే ఈకష్టాలు కలకాలం ఉండవని ఓదార్పు కలిగింది.

కష్టాలను కోరినెత్తికెత్తుకొన్నానే అని వినాయక్ క్షణకాలం అనుకోకపోలేదు. వెంటనే ఎత్తుకోక తప్పదనుకన్నాడు. కర్మణ్యేవాధికరస్తే అనీ అనుకొన్నాడు. జీవించమంటే బాధ్యతలు భరించటమే పారిపోవటం సాధ్యంకాదు. ఎంత దూరం పారిపోవటం? ఎంతకాలం

పారిపోవటం? ఎవరికోసం పారిపోవటం? పారిపోతూ బతకటమెందుకు? తాడోపేడో జీవితాన్ని ఎదుర్కొంటేనే తేలిపోతుంది.

ఈ బావి కష్టం నష్టం ఎంతోకాలం బాధించవు. నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయం నుంచి తవ్వటం ఆరంభమయింది. కష్టం వస్తే బండ పడితే మళ్లీ ప్రారంభించడానికి ఆ నిర్ణయమే కారణమయింది.

భార్యాభర్తలిద్దరికి వచ్చేజీతం ఆరునూర్లు. అందులోనూ ఇల్లు గడవాలి. తల్లితండ్రులుకు పంపాలి. పిల్లల చదువులకు ఖర్చుచేయాలి. వడ్డీ కట్టాలి. పదివేలు అప్పు. ఎంత లేదన్నా బావికి రెండు వేలు ఖర్చు. ఖర్చులో ఖర్చు తీర్చగలమన్నధీమా! అప్పు మీద అప్పు పెరుగుతున్న వడ్డీ సరే కానీయ్ మని పట్టుదల. తీర్చగలమని విశ్వాసం. ఆ విశ్వాసమే ఆ మొండితనమే ఇల్లుగా మారింది. బావిగామొదలయింది. బండగా రూపెత్తింది.

గోవిందు గజంతాడు అర్ధవ్యాసంతో వృత్తం గీశాడు. ఇది బావి అన్నాడు. దండం పెట్టాడు. టెంకాయ కొట్టాడు. పూలుపెట్టాడు. అగరొత్తులు వెలిగించాడు. పప్పులు బొరుగులు, బెల్లం ముక్కలు పిల్లలకు పంచిపెట్టాడు. తానిన్ని బొక్కాడు. తన భార్యకిన్ని ఇచ్చాడు.

టెంకాయ నీళ్ళు పడ్డచోట గునపంతో గుచ్చాడు. గడారుతో పొడిచాడు. గొడ్డలితో నరికాడు. పికాసితో గుచ్చాడు. పారతోతవ్వాడు. గమేళాలోకిఎత్తాడు. నెత్తికెత్తుకొన్నాడు. వృత్తం చుట్టూ తిరిగాడు. దూరంగా మట్టి వేసి వచ్చాడు.

పనికి వంగిన గోవిందు మళ్ళీ మాట్లాడలేదు. నడుం ఎత్తులేదు. మట్టి తవ్వుకున్నారు. గంపకెత్తుతున్నారు. భార్యతలకెత్తుకున్నాడు. ఆమె దూరంగా పోసి వస్తూ ఉంది. రోజూ ఇదే పని.

గోవిందు తెల్లవారు జామున వచ్చేవాడు. వెంట కొడుకుఉంటాడు. సూర్యోదయానికి ముందే చాలాపని ముగించుకొనేవాడు. ఉదయమే భార్య వచ్చేది. వస్తూ సద్ది తెచ్చేది. సద్దిమూట నీళ్ళకుండ గంపలోపెట్టుకొని గంపనెత్తిన పెట్టుకొని గంప పట్టుకోకుండా ఆమె నడుస్తుంటేచూడాలి. అంత సుకుమారంగా ఆడవాళ్ళు కష్టజీవులు అంత శరీరంతో అంతా సునాయాసంగా అందంగా నడుస్తారని లోకానికి తెలియదు. ఎంత బరువు ఎత్తుకొన్నా ఎంత శ్రమ చేస్తున్నా అంత సుకుమారంగా నడవటం ఆశ్చర్యంగా ఉండేది.

నడకలో, కదలికలో, పనిలో, బరువులో మాటలో అన్నింటా ఆమె సుకుమారంగా సున్నితంగా సునాయాసంగా కనపడుతుంటే చాలా అద్భుతమనిపించేది. మహారాణుల సొగసు సోయగాల ఆమె ప్రతి కదలికలో కనిపించేవి. చిన్నతనంలో రెడ్డి రాజులు, వడ్డె

రాజులుఅవి విన్నమాటలు గుర్తుకురాసాగాయి. ఈమె ఆ రాజవంశాల మహారాజుల సౌకుమార్య ప్రతినిధిగా కనిపించింది. మట్టి మనిషిగా లేదు.మహారాణిగా ఉంది. వడ్డెరాజులు నిజంగా రాజులే అయి ఉంటారని గోవిందు భార్యను చూచిన తరువాతే అనిపించింది.

గోవిందు శ్రమజీవి. పనిచేస్తున్నప్పుడు ప్రతి వెంట్రుక పాదులో నుంచి చెమట బైటికి వచ్చేది. అలా ఊరిన చెమట బిందువులయ్యేది. బిందువులు బరువై కదిలేవి. అవి సమూహమయ్యేవి. పరిమాణం పెరిగి అవి ప్రయాణించేవి.అవి ప్రయాణించినంతమేర గీతలు గీసినట్లు అయ్యేది. వంగిన గోవిందు వెన్నుమీద పుట్టి, పక్కటెముకల మీద జారి పొట్టమీదికి వచ్చి జారి పికాసి మీద మట్టి మీద పడే చెమట బిందువులు హారతి పళ్ళెంలో దక్షిణ వేస్తున్నట్లుగా పడేవి. భూగర్భంలోని జలం బైటికిరావటానికి స్వాగతం పలుకుతున్నట్లుగా చెమట బొట్లు బావిలో పడుతుండేవి.

చెమట పట్టిన గోవిందును చూస్తుంటే మనిషి ఇంతగా పరిణామం చెందటానికి ఉన్న మూలసూత్రం గోచరం కాసాగింది. చెమట పట్టి గోవిందు శరీరం ఎంతో అందంగా కనిపించేది. శ్రమజీవే సుందరుడు. చెమట పట్టిన శరీరమే శ్రేష్ఠం. చెమట జీవే లావణ్యవంతుడు. ఆమెకు చెమట పట్టదు. ఆమె అలసిపోదు. ఆయాసపడదు. ఆమె చేసే ఏ పని కూడా ఆమెకుకష్టం కాదు. ఆమె ఆడుకొన్నట్లే పనిచేస్తుంది. అంత పెద్ద మట్టి కంప ఇద్దరు గొప్ప మగవాళ్ళు కూడా ఎత్తలేరు. ఆమె సునాయాసంగా ఎత్తుకొంటుంది. సుతారంగా పారబోసి వస్తుంది. ఆ పని ఆమెకు చెండాటలా ఉంది. ఆమెకు చెమట పట్టదు. ఆమెకు  చెమట పట్టాలంటే ఆమె ఇంకెంత పెద్ద పని చేయవలసి ఉంటుందో ఆలోచిస్తేనే ఆశ్చర్యంగా ఉంటుంది. ఎంత పెద్దపనయినా చేయగలిగే ఆరోగ్యం నిజానికి కష్టజీవుల సొంతం.

గోవిందు మొదట మట్టు తవ్వినప్పుడు మట్టే వచ్చింది. రెండో మట్టులో గులక, కంకర, తగిలాయి. మూడో మట్టులో గరుసుపడింది నాలుగోమట్టులో చెమ్మ తగిలింది. 'గంగుంది సావీ' అన్నాడు గోవిందు. ఆనందమే ఆనందం.

అయిదోమట్టు పూర్తయ్యే సరికి బండ కనిపించింది. ఆమూలా ఈమూలా తవ్వి తడిమిచూశాడు. బండ అఖండంగా ఉంది. పెద్ద బండ. చాలా వెడల్పు, బండ మీద మట్టి కడిగినట్లు శుభ్రం చేశాడు. నున్నగా బండ తేలింది.

బండను కొట్టాడు. కోశాడు. నరికాడు. గునపం సొట్టబోయింది. గడారు వంగిపోయింది. పికాసి మొనబోయింది. కమ్మరిదగ్గర వీటిని సరిచేయించి తీసుకొని వచ్చాడు. లాభం లేదు. బండ తన పనిముట్లతో పగలదు. ఇక తవ్వలేడు.

ఒకరోజు వినాయక్ కాలేజీ నుంచి వచ్చే సరికి గోవిందు బండమీద పడుకొని ఉన్నాడు. చెవిని బండకు ఆనించి నిస్తంత్రీ సమాచారం వింటున్నాడు. దూరవాణిని ఆలకిస్తున్నాడు. విని సంతోషంగా కూర్చున్నాడు. పైకి చూశాడు. తాడుపట్టుకొని బావి అంచు గుంట్లో కాళ్ళు పెట్టుకొంటూ చెకాచక పైకి ఎక్కి పైకి వచ్చి 'సామీ' అన్నాడు 'గంగుండాది' అన్నాడు. తల్లుండాది. నేనొత్తాననే నాకుచెప్పె. నేనినింట. ఇప్పుడే ఇనింటి. గంగ ఉందని. అరడుగు కింద ఉందని ఆమాత్రం బండ తొలగిస్తే నీరు తన్నుకొంటూ పైకి వస్తుందని గోవిందు ఆనందంగా చెప్పాడు.

అరడుగు బండ పగలగొట్టాలి. తూటా పేల్చవచ్చు. మిషను పెట్టి పగలగొట్టవచ్చు. బోరు వేయవచ్చు. కానీ బోరు కష్టం. మిషను పెట్టటం ఖర్చు. తూటాలతో పేల్చటం సులభం. అంతఖర్చూ కాదు. కొంత మేలు. అయినా ఖర్చే అందుకే భయమయింది. పని ఆపక తప్పలేదు. శుక్రవారం చేసినంత వరకు బట్వాడా ఇచ్చాడు. పని కొంచెం ఆపక తప్పదన్నాడు వినాయక్. పనిచేయటానికి గోవిందు ఆరాటపడుతున్నాడు.

బావి తవ్వుతున్న మొదటి రోజుల్లో గోవిందు భార్య సద్ది తెస్తూ నీళ్లు తేవటం వినాయక్ గమనించక పోలేదు. తాగటానికి నీళ్ళు ఇవ్వమనుకొందా, ఇవ్వలేమనుకొందా, ఆ కష్టం వాళ్ళ కెందుకనుకొందా, వాళ్లింట్లో నీళ్ళు తాగరాదనుకొందా. ఏమనుకొందామె అని అతను మథనపడ్డమాటనిజం.

మండిపోతున్న ఎండలకు నీళ్లన్నీ తాగేసిన గోవిందు మళ్ళీ నీళ్ళు కావాలంటే లేనని చెప్పిన భార్య ఎండలో వెళ్ళి వేప చెట్టు పక్క బవిలో నీళ్ళు తోడి తెచ్చి ఇచ్చింది.గోవిందు తాగాడు. ఆ రోజు ఆదివారం. అందరూ ఇంట్లోనే ఉన్నారు. నీళ్లిమ్మంటే ఇచ్చేవాళ్ళు. అడగలేదు.

గోవిందు భార్యతో ఆ రోజు పని ముగించుకొని ఇంటికి వెళుతున్నప్పుడు గోవిందుతో వినాయక్ చెప్పాడు. 'నీళ్లు కావాలంటే ఇంట్లో ఉన్నాయి. తెచ్చుకొని తాగండి.' వాళ్లు ముఖం ముఖం చూచుకొన్నారు. సరే అనలేదు. మీ నీళ్ళు మేమెట్లా తాగుతామా అనలేదు. అట్లాగే 'సామీ' అనలేదు. 'ఊఁ' అన్నాడు. అన్నాడే కానీ ఎప్పుడూ నీళ్ళనగడలేదు. తాగలేదు. కానీ గోవిందుభార్య కుండలో నీళ్ళు ఇంట్లో ఇచ్చేది. ఇంట్లో నీళ్ళు తీసుకోలేదు కానీ, ఇంట్లోకి నీళ్ళు తెచ్చి ఇచ్చేది. పిల్లల తిప్పలు చూడలేక నాలుగు కడవల నీళ్ళు తెచ్చి ఇచ్చివెళ్ళేది.

వినాయక్‌కి చిన్నతనంలో ఊరబావిలోంచి నీళ్ళు తాను మోసి తెచ్చుకోవటం గుర్తుకు వచ్చింది. తల్లి వంటి పల్లె తలలో తారాడితే కళ్ళు నీళ్ళ కుండలయ్యాయి. తల్లి పేగు నుంచి బొడ్డుకోసినట్లు పల్లెపేగునుంచి ఉద్యోగం కోసేసింది. గుంటూరు దగ్గర మెట్ట గ్రామంలో పుట్టిన వినాయక్ ఉద్యోగం కోసం అనంతపురం వచ్చినప్పుడు శబ్దం నుంచి నిశ్శబ్దంలోకివచ్చినట్లు భావించాడు. సమ్మె నుంచి విరమణలోకి దూకినట్లు కనిపించాడు. అందోళన నుంచి తీరుబడి లోకి తోయబడ్డట్లు అనుకొన్నాడు. వేగం నుంచి ప్రశాంతతలోకి ప్రవేశించినట్లు అనుభూతి చెందాడు.

అక్కడి హరిజనులు హక్కుల కోసం పోరాడుతున్నట్లు ఇక్కడివాళ్ళు బ్రతుకుదెరువుకోసం పోరాడలేకపోతున్నారని స్పష్టంగా తెలిసి వచ్చింది. తాను రూం కోసం వెతుకుతున్నప్పుడు తన వాళ్ళుండే చోట్లకు పోలేదు. వాళ్ళతో ఉండేపరిస్థితి తప్పి పోవటం మేలే అయింది. మిగతావాళ్ళతో మెలగటం నేర్చుకోవలసి వచ్చింది. కొన్ని గుణాలు పోవటం, కొన్నిగుణాలు రావటం చూస్తుంటే తానేమైపోతున్నానోఅని మొదట్లో ఆందోళన పడ్డాడు.

ఆ రోజుల్లోనే భాగీరథి కలిసింది. మనస్సులు కలిశాయి. పెళ్లయింది. ఏ ఆర్భాటాలూ లేవు. మామూలుగా జరిగిపోయింది పెళ్ళి. తల్లితండ్రులకు ఇరుపక్షాలా ఇష్టంలేదు. కష్టమూ లేదు. పెళ్ళికి రాలేదు వాళ్ళు చూస్తుండగానే నలుగురు పిల్లలు 'చదువులు' అనారోగ్యం ఇల్లు బావి. పెద్ద చదరంగంలో చిన్న పావులా కదులుతున్నాడు వినాయక్.

పెట్టే సంచితో అనంతపురంలో రైలుదిగిన ఒక్క మనిషి పదేళ్ళలో ఆరుగురయ్యారు. బ్రతుకుమోయలేని సామానయింది. కదపలేని ఇల్లు అయింది. తవ్వలేని బావి అయింది. భాగీరథి సాంఘికస్థాయి తనకు స్థాయి నిస్తుందని భావించిన అతడి ఆశ ఆత్యాశే అయింది. పైగా తనస్థాయి ఆమెకు కూడా సంక్రమించింది. అందుకే పిల్లలకయినా తన అవస్థ అంటుకోరాదని అతని ఆరాటం, తాపత్రయం.

ఒకరోజు భాగీరథి మనకులం ఆమెకెలా తెలిసిందో అంది. గోవిందు భార్యను గురించి. అతను చెప్పాడు. మన కులాలు కాదు నాకులం ఆమెకు తెలుసు. నాకులం నేనురాకముందే అనంతపురానికి తెలుసు. హరిజన లెక్చరరు వచ్చి చేరబోతున్నాడని ఆర్డరు వచ్చినప్పుడు కాలేజీకి తెలుసు. లెక్చరర్లకు తెలుసు. పిల్లలకుతెలుసు. ఊరంతటికీ తెలుసు. నాకులం, నా జీవితం నా కంటే ముందే ఇక్కడ వచ్చింది. అనంతపురం గాలిలో నాకులం కలిసింది. ఎవరూ పిలిచినా ఇదే వాసన.

కులం ప్రాధాన్యం నీకంతుపట్టినట్లు లేదు. మనిషి కంటే కులం ముఖ్యం. మనిషి

ముఖంలోనే నుదుటి మీదే కులం కనపడుతుంది. లేదా పేరుతో ఉంటుంది. కాదా ప్రవర్తనలో ఉంటుంది. కాకపోతే కాగితాలమీద ఉంటుంది. కులం తెలుసుకొనే జనం మనిషితో మాటలు కలుపుతుంటారు. సంబంధాలు, బంధుత్వాలు, ఆత్మీయతలు స్నేహం చివరకు వైరం కూడా కులం పునాది మీదే. కులం వినా ఈజనం సున్నా.

భర్త ఆవేశం గుర్తించింది. చల్లపరిచే మార్గం. కాఫీ. అంత ఇష్టం. మాటలు మాని కాఫీ తాగుతూ కూర్చున్నాడు.

అర్ధరాత్రి దాహమయింది. లేచి తల దగ్గరున్న చెంబులోంచి నీళ్ళు తాగి కూర్చున్నాడు. అనంతంగా చీకటి అలముకొని ఉంది. ఎక్కడా చీమ చిటుక్కుమన్నా అలికిడి లేదు. దూరంగా అనంతపురంలైట్లు కనపడుతున్నాయి.

ఎక్కడిదో ఒక పిట్ట అర్ధరాత్రి నిద్రలేచి గూడువదలి, కూడుకో నీడ కొరెక్కలు టపటప కొట్టుకొంటూ జమ్మి చెట్టు మీంచి లేచింది. బతుకు తాపత్రయానికి ఇంత రాత్రి సూర్యోదయమయింది. జమ్మిచెట్టు కాలిబాటలో ఉంది. దాని కింద పాముల పుట్ట. పుట్టనిండా పాములు. నాగుల చవితి వస్తే పూజలు కొదవలేదు. అయినా పాములకు కొదవలేదు. భయానికీ కొదవలేదు.

ఆ కాలిబాటే బళ్ల బాట అయింది. సైకిళ్ళు,కార్లు లారీలు ఆ బాటనే వస్తూ పోతూ ఉంటాయి. అప్పుడు బాటా కాదు. రోడ్డూ కాదు. రెండూ అదే. అర్ధనారీశ్వరత్వం. అనంతపురానికి నారాయణపురానికి అదే తోవ. జమ్మిచెట్టు కింద శాశ్వతంగా పాముల భయం.

తలకింద రెండు చేతులూ పెట్టుకొని ఆకాశంలోకి చూస్తూ చుక్కలు లెక్క బెడుతున్నాడు. లెక్కొక్కడా తేలదు. బావి లెక్కలాగా. అల్లంతదూరంలో బావికదలకుండా పడుకొని ఉంది. రేపు మళ్ళీ పని మొదలు. ఎంత లెక్కతింది. ఏమీ ఎరగనట్లు మౌనంగాఉంది. బావి పైగా, మట్టి గుట్టపైగా అనంతపురం పైగా దేవరకొండ వైపుచూస్తున్నారు వినాయక్. రేపు సూర్యోదయం నిరీక్షిస్తున్నాడు.

గుంతకల్లు నుంచి ధర్మవరం పోయే గూడ్సు తాటిచర్లలో కదలినట్లయింది. సన్నటి ఈలలాంటి, వేణువు లాంటి, మురళిలాంటి పాటగా చుక్ చుక్ వినపడసాగింది. అదిగూడ్సే. ఇప్పుడొచ్చేరైలులేదు. దొంగల బండి వెళ్ళిపోయి ఉంటుంది.బైరాగులబండి ముందే వెళ్ళిపోతుంది. ఇది గూడ్స్ చుక్కుచుక్కు క్రమంగా లయబద్ధంగా పెద్దదికా సాగింది.తడిక లేటిమీదికి వచ్చినట్లుగా ఉంది. బ్రిడ్జి దాటుతూ ఉంది.అందుకే దడదడలాడిస్తూ ఉంది.

అవ్యక్తమధురంగా ఉన్నపాట సువ్యక్త మధురంగా మారింది. శబ్దంలేని చీకటి రాత్రికి గూడ్సు శబ్దం సరిగమలకన్నా చక్కగా ఉంది.

ఇంకా కొంచెంసేపట్లో తెల్లవారుతుంది. గోవిందు కొడుకుతో భార్యతో వస్తాడు. తూటాలు పెడతాడు. పేలుస్తాడు. బండ పేలుతుంది. పగులుతుంది. పెచ్చులూడతాయి. కనీసం బండకు నెర్రె పడుతుంది.నీళ్ళు పొంగుతాయి. తాగేనీళ్ళ దాహబాధ. అతను ఆశ పడుతున్నాడు.

నిజమే! అతను ఆశాజీవే. బావిలోనీళ్ళు పడతాయి. అంతేకాదు. తమ భవిష్యత్తు బాగుంటుంది. ఆశపడుతూనే ఉన్నాడు. ఆ ఆశల్ని కలల్ని తియ్యగా తింటున్నప్పుడు పెద్ద కూతురు ఏడుస్తూ వచ్చింది. ఏడుపు చూడలేక పోయాడు. బుజ్జగించాడు. ఏడుపు మానిపించాడు.

ఆచార్యుల భార్యను కూతురు అత్త అనటం అతడికి ఆనందం కలిగించింది. పిల్లలంతా దొంగాట ఆడుకొంటున్నారు. దొంగపై అన్నారు. అత్తవాళ్ళఇంట్లోంచి పై వినిపించింది. అందరూ పరుగుపరుగున పోయారు. అత్తవాళ్లింట్లో పాప చొరబడబోయింది. అత్త ఆపింది. అక్కడే ఉండమంది. తన వెనుకవచ్చిన పిల్లల్ని లోనికి పోనిచ్చింది. వాళ్లు దొంగనుపట్టుకొన్నారు. తనను పోనిచ్చి ఉంటే తాను దొంగను పట్టుకొని ఉండేది. ఆటంకం వల్ల అవకాశం పోయింది. కూతురు ఇంకా ఏడుస్తూనే ఉంది.

'నీకాళ్ళకు మురికి ఉండి ఉంటుంది. అందుకే అత్త రానిచ్చిఉండదు.'

'అందరికాళ్ళకూ మురికి ఉంది.'

'నీ కాళ్ళకు ఎక్కువ దుమ్ము ఉండి ఉంటుంది.'

'ఏమో' అంది 'దొంగదొరికేవాడే అంది. 'పట్టుకోలేకపోయాను.' 'ఏడుపు దిగమింగింది' .అత్త చెడగొట్టింది. ఏడ్చింది.

దొంగను తానే అందరికంటే ముందుగా పట్టుకోలేకపోయినందుకు పాపకు నిరాశగా ఉంది. దిగులుగా ఉంది. బాధగా ఉంది. కోపంగానూ మారుతుంది.

దొంగను పట్టుకొనే అర్హత, అవకాశం, వేగం, చురుకుదనం ఉన్న తన కూతురు, తన వల్ల తన అనర్హత వల్ల నష్టపోయింది. పాపతన శక్తుల్ని తాను వినియోగించుకోలేకపోయింది. అర్హత ఉండి కూడా అవకాశం ఉండి కూడా ఆటంకం కలగటం పట్ల కూతురు కంటే అతనికే ఎక్కువ ఆందోళనగా ఉంది.

దొంగను పట్టుకొంటే ఆమె ఆటలో ఆలోచనలో వ్యక్తిత్వంలో నూతన వికాసం వస్తుంది. పట్టుకొనే అవకాశం లేకపోయి, తనకు తెలియకుండా తనుకారణం కాకుండా ఆటంకం ఏర్పడి తనసామర్థ్యం మీద తన ప్రయత్నం మీద తన కృషి మీద పాపకు సందేహం కలుగుతుంది. ఇటువంటివి అనేకం జరిగితే మనసు మొద్దుబారిపోతుంది. ఇదే తరతరాలుగా జరిగితే ఏమైనా ఉందా?

ముళ్ళకంప అడ్డం పడ్డ మొక్క వంగిపోయినట్లు తన కూతురు జీవితం, వ్యక్తిత్వం వికాసం, భవిష్యత్తు ఇలా ఆటంకాలకు గురి అవుతాయా? ఇది ఎటువంటి ముద్ర వేస్తుంది. అతను ఆలోచించలేకపోయాడు.

'చూశారా!' భాగీరథి అడిగింది.

'విన్నాను.'

"పిల్లల్ని ఎవరిళ్ళకూ పోనివ్వవద్దంటే మీరు వినరు."

"వింటాను. పోనీయ్. మంచి చెడ్డలు వాళ్ళకే తెలియనీయ్."

"మనమే చెబితే"

"పిరికి మందు నూరిపోయటమే."

"వాళ్ళు బాధపడతారు."

"రాటుదేలుతారు."

"ఏమో ఏం పరిణామాలో"

"పిల్లలు వాళ్ళంతట వాళ్ళే కాలనీ వాళ్ళ నుంచి వాళ్ళ స్థితిని తెలుసుకోనీయ్. పిరికివాళ్ళయితే ధైర్యం నూరిపోద్దాం. ధైర్యంగా ఉంటే ప్రోత్సహిద్దాం. ప్రతిఘటిస్తుంటే నెమ్మదిగా ఉండడం నేర్పుదాం. వాళ్లకు పట్టుదల రానీ, పౌరుషం రానీ, దీక్షరానీ, వాళ్ళు కార్యసాధకులుకానీ వీళ్ళు తలవంచుకోరాదు. నిద్ర రాదు. అసమర్థత కాదు. అతిశయం ఉండరాదు. మేం ఎవరికంటేనూ తక్కువ కాదు అని మాత్రమే కాదు. మాకంటే ఎవరూఎక్కువకాదు అనుకొనేటట్లు పెరగనీ. మేం ఎవరికంటేను ఎక్కువ కాదు. అనుకొనేటట్లు పెరగనీ, ఇందిరాగాంధీ నీకంటే ఏమెక్కువ ? ఆమె కుండే అవకాశాలునీకు ఉంటే నువ్వు ఆమెకంటే తక్కువకాదు. పిల్లలిలా గుర్తించాలి. గొప్పవాళ్ళు కావాలని అనుకోవాలి ఆరాటపడాలి. పోరాడాలి. సాధించాలి. అతిశయపడకూడదు. అహంకారం చూపకూడదు. గర్వం గుండెను కాటేయరాదు. తలపొగరెక్కరాదు. నాకు నమ్మకముంది. ఇన్ని అసౌకర్యాల మధ్య, అవస్థల మధ్య, ఆటంకాల మధ్య జీవన పోరాటం సాగించేవాళ్ళు చాలామంది కంటే సమర్థులవుతారు. కావాలి." భార్య ఆప్యాయతలో నిమురుతూ కూర్చుంది.

ఉన్నట్టుండి చిన్న కూతురు పరుగు పరుగున వచ్చింది.

'నాన్నా! నేను పిన్నోళ్ళింటికి పోను.'

ఏదో జరిగిందని అర్థమయిపోయింది. ఇలా జరగటం మామూలయిపోయింది. కూతురు ఏడవటం లేదు. అదే పదివేలు. అపిన్ని అంటే శాస్త్రి భార్య. కాలనీలో ఉండే ఆడవాళ్ళంతా మగవాళ్ళందరూ చిన్నా చితకా, ముసలీముతకా అందరిని వరుసలు కలిసి పిలుస్తుంది. చిన్న కూతురు వాగుడుకాయ.

మనుషులందరిని బంధువుల్లా పలకరించటం వినాయక్‌కి చిన్నతనంలో అలవాటు కాలేదు. మానవ సంబంధాలలో ఆత్మన్యూనతా భావం కాని, ఆత్మాధిక్యతాభావం కానీ లేకుండా పిలవటం, తలవటం, పలకటం, పలకరించటం అతను చాలా కష్టపడితే కాని సాధించలేకపోయాడు. కూతురు సునాయాసంగా బంధుత్వాలు కలుపుతుంటే అతనికి సంతోషంగానే ఉంది.

'నువ్ నా మాటింటివా ఇన్లె' అంది చిన్న కూతురు.

'వింటాను చెప్పు.'

'పిన్ని అందరికీ నీళ్ళిచ్చింది. అందరు గ్లాసులు కడిగి, తొరిపి తీసుకొని పోయింది లోనికి. నా గ్లాసు బండ మీద పెట్టించింది.'

'నీళ్ళిచ్చినందుకు సంతోషం ఏం ప్రత్యేకత.'

అవ్వకడిగిలోన పెట్టింది. అవ్వ పనవ్వ.రాయుడోళ్ళ అవ్వ కూతురికి లోకం అర్థమవుతూ ఉంది.

'నువ్వంటే ఏమనుకొన్నావు. మరి స్పెషల్ నీ గ్లాసులు పనివాళ్లు కడగాలి. అంటే నువ్వు పనివాళ్ళను పెట్టుకోవాలి. అంటే పెద్ద ఉద్యోగం చేయాలి.అంటే పెద్ద చదువులు చదవాలి. పిన్ని నిన్ను ఆశీర్వదించింది.'

కూతురునమ్మలేదు.

చిన్నకూతురు తండ్రినిఆశ్చర్యంగా చూడలేదు. అమాయకుణ్ణి చూచినట్లు చూచింది. బుడుక్కున వంగి ముందుపెట్టుకొని ఇంట్లోకి పరుగెత్తింది.

ఇటువంటి సందర్భాలు అనేకం. పిల్లల తల్లి ఉడికిపోతూ ఉండేది.పట్టరాని కోపం తెచ్చుకొనేది. భర్తను పగిలే అగ్నిపర్వతం అనుకొనేది.పొగరాదు. వేడి లేదు. పగలదు. లావా లేవదు. దగ్ధం చేయదు. అయితే ఎప్పుడీ అగ్నిపర్వతం బద్దలవుతుందో అన్నట్లుగా ఉండేవాడు.

అతను ఎన్నో ఓర్చుకొనేవాడు. ఏమనిషయినా ఎంత ఓర్చుకోగలడు? కొంత ఓర్పు మించితే గుండె భరిస్తుందా? శరీరం మోస్తుందా? కాలిపోతూచల్లగా ఉండడం ఈ మనిషికి ఎట్లా సాధ్యమయిందా అని ఆమె ఆశ్చర్యపోతుంది.

ఆ రోజు ఆదివారం. అందరూ ఇంట్లోనే ఉన్నారు. పిల్లలు ఆడుకొంటున్నారు. చుట్టుపక్కలవాళ్ళు తమ ఇంటికి వచ్చి ఆడుకొంటూ ఉన్నారు. అలసిపోయి దాహం అడిగారు. కూతురు అందరికీ నీళ్ళు తెచ్చి ఇచ్చింది. అందరూ తాగారు. అందరిగ్లాసులు తానే కడిగి లోన పెట్టింది.

పిల్లలు పిడుగుల్లా మెట్ల మీద, మేడ మీద ఒకటే దూకుడు. ఎగురుడు. ఆటలు, పాటలు, ఇల్లుపీకి పందిరివేస్తున్నారు. మధ్యాహ్నం విశ్రాంతి తీసుకొంటున్న భాగీరథి అశాంతిగా కదిలింది. అది అనర్థమయ్యే ప్రమాదం ఉంది. ఆమె పిల్లల్ని వాళ్ళ అల్లర్ని తిట్టే ప్రమాదం ఉంది. పిల్లలు ఇంటికి రావటం,ఆడుకోవటం, నీళ్ళు తాగటంఅతనికి ఇష్టం. వాళ్ళను తిట్టి తరిమేయకుండా చూడడానికి భార్యదగ్గరకు వచ్చి కబుర్లు ప్రారంభించాడు. ఆమె అశాంతి తగ్గింది. పిల్లల్ని తిట్టలేదు.

వాళ్ళ అల్లరి ఎంతో ముచ్చటగా ఉంది. చిలుక పిల్లలు. పిచ్చుక పిల్లలు కిచకిచలాడినట్లుంది. వాళ్ళెంత హాయిగా ఆడుకొంటున్నారు. లోకం తెలియదు. అమాయకులు. వీళ్ళు పెద్దవుతారు. అన్నీ తెలుస్తాయి. హెచ్చు తగ్గులుగుర్తిస్తారు.భేధాలు, విభేదాలు అంతుపడతాయి. ఆ గొడవ జీవితం ఆరంభమవుతుంది. ఈ లోగా కనీసం ఇలాగా నీళ్ళు బ్రతకటం

ఎంత అదృష్టం. వీళ్ళు ఇలాగే ఇంత సుఖంగా, ఇంత అమాయకంగా ఇంత అన్యోన్యంగా ఇంత ఆత్మీయంగా కలిసి మెలిసి ఉండేటట్లు చేసే మార్గమేలేదా? ఏకులమూ, మతమూ లేని పిల్లల్లాగా వీళ్ళను పెంచలేమా? కుళ్లు కల్మషం రాకుండా చూడలేమా అతనుదిగులుగా ఉన్నాడు.

అంతలోనే ఆనందం, నీళ్ళతో వీళ్ళందరితో తమ పిల్లలు నలుగురూ కలిసి ఆడుకొంటున్నారు. పాడుకొంటున్నారు. ఉత్తుత్తి అన్నం వండుకొంటున్నారు. తింటున్నారు. లేని నీళ్ళు తెచ్చుకొంటున్నారు. తాగుతున్నారు. లేని పరుపులు మీద పడుకొంటున్నారు. ఎండలో, నాప బండలో మీద హంసతూలికా తల్పం మీద శయనించినట్లు భావిస్తున్నారు. వేప చెట్టు నీడ కల్పవృక్షచ్ఛాయగా తలపోస్తున్నారు. వీళ్ళెంత అదృష్టవంతులు.

తనకా అదృష్టం కలిగిందా? తనలా ఆడుకొనే వీలు చిక్కిందా? చిన్నతనంలో పిల్లలు ఆడుకొంటుంటే తాను దూరం నుంచి చూచేవాడు. ఆనందించేవాడు. దగ్గరకు పోయేవాడు కాదు. పోతే వాళ్ళు వెళ్ళిపోతారు. ఆట మానతారు. వాళ్ళ ఉత్సాహం పాడైపోతుంది. వాళ్ళ

ఆటలు చెడగొట్టేవాడు. కాదు. వాళ్ళతో ఆడుకోలేక పోతున్నానే అదే బాధపడ్డమాట వాస్తవమే. కాళ్ళు లేనివాళ్ళు పరుగెత్తకపోయినా పరుగు పందెం చూచి ఆనందించినట్లు అనుభవించేవాడు. ఆడలేకపోయినా ఆట చూచి ఆనందించటం నేర్చుకొన్నాడు.

తనకు కాళ్ళు చేతులూ అన్నీ సక్రమంగా ఉన్నాయి. ఉత్సాహంగా ఉంది. వాళ్ళతో తానూ ఆడుకోగలడు. ఆడే శక్తి ఉంది. ఓపిక ఉంది. ఆశ ఉంది. ఇష్టం ఉంది. అవకాశం లేదు. అదేబాధ. అది అతన్నికాల్చుకొని తినలేదు. తనకంటే అనుకొన్నాడు. తనుకంతేనని తెలుసుకొన్నాడు. ఇది చాలు. ఇలా చాలు. ఇంతకంతే ఏమీ వద్దని ఏమీ చేయలేక తనను తాను సర్దుబాటు చేసుకొనేవాడు. కానీ నిరాశ మాత్రం మిగిలే ఉంది.

ఇప్పుడు చిన్న పిల్లవాడు అయిపోయి మానసికంగా వాళ్ళతో ఆడుకొంటున్నట్లే ఉన్నాడు. పరుగెత్తుతున్నాడు. పడుతున్నాడు. లేస్తున్నాడు. అంతా ఇష్టారాజ్యం.

తీరుబడిగా చూస్తే తన పిల్లలు తనకు లేని అదృష్టం పొందారు. వాళ్ళు ఆడుకొంటుంటే ఆనందంగా ఉంది. తామూ ఆడుకొంటున్నట్లే ఉంది. తన నలుగురు పిల్లల రూపంలో తానూ ఆడుకొంటున్నాడు. తానొక్కడు నలుగురై ఆడుకొంటున్నట్లు ఆనందం.

పదిమందితో కలిసిపోయి తన పిల్లలు ఆడుకొంటుంటే సప్తసముద్రాల అవతల రాకాసికోనలో మంత్రాల మర్రి తొర్రలోని వజ్రవైఢూర్యాల హారాలు మాయజలతారు తివాసిమీద కీలుగుర్రం మోయగ వచ్చి మెడలో పడినట్లు ఆనందం.

ఆ ఆనందం అంచుల మీద కాగితం పడవలా తేలిపోతున్న వినాయక్‌కు లోకం గుర్తుకు తెచ్చింది. డైరీ పాలలారీ, తెల్లవారు ఝామునే వచ్చే లారీ కీచుమంటూ ఇంటి ముందే ఆగింది. దాని రాక సైరన్‌మోతలాగా వినిపిస్తుంది. ఒక్కొక్క ఇంట్లో లైట్లు వెలగటం ప్రారంభమయింది. పాల సాచెట్ కోసం వస్తూ పోతూ జనంసందడి మొదలయింది.

నారాయణపురం నుంచి అనంతపురంపోయే పాలకేన్లు సైకిళ్ళ మీద ఉన్నాయి. బెల్లులు మోగుతున్నాయి. గంపల్లో పాలూ పెరుగూ తీసుకుపోయి అమ్ముకొనేవాళ్ళు కదలికలు మాటలు పెరుగుతున్నాయి. అప్పటొకటి ఇప్పుడొకటి ఎడ్ల బళ్ళు కూడా వస్తూ పోతూ ఉన్నాయి.

అనంతపురానికి తపోవనానికి మధ్య గీత గీసినట్లు వేస్తున్న బైపాసురోడ్డుకు కంకర తోలు తున్న లారీల రాకపోకలు రద్దీ పెరగ్గానే వినబడుతూ ఉంది.

ఇళ్ళ ముంగిళ్ళలో, చెట్ల కింద, ఆరుబయల్లో మంచాలేసుకొన్నవాళ్ళు ఇళ్ళలోకి మకాం మార్చుకొంటున్నారు. ఇంకా అయిదుగంటలు కాలేదు. స్కూలు పిల్లలు మేల్కొన్నారు. పాఠాలు వల్లిస్తున్నారు.

ఆచార్యులు లేచాడు. గుర్తు దగ్గు. రాత్రి సమయంలో ఎక్కడ నిద్రపోతుందో ఏమో కానీ ఆచార్యులు నిద్రలేస్తే దగ్గుకూడా నిద్రలేచి వస్తుంది. ఇంట్లోవాళ్లని అతను లేపేపని లేదు. దగ్గే లేపుతుంది. ఆచార్ల దగ్గు తగ్గదు. ఆగిపోదు. నయంకాదు. దగ్గు అతడి వంట్లో ఒక అవయవమై కూర్చుంది. అతను దగ్గును ఆరోగ్యంగా పోషించుకొంటున్నాడు.

ఇళ్లముందు నీళ్ళు చల్లుతున్న చప్పుళ్ళు వినబడుతున్నాయి. నీళ్ళు పడి, నిద్రలేచి, అరిచి, వళ్ళు విదుల్చుకొని, వీధి కుక్కలు కాలనీ సింహాలు అయ్యాయి. బృహదీశ్వరాయలంలో తలుపులు తెరచినట్లున్నారు.

కాలనీ పుడుతూనేగుడి పుట్టింది. హిమాలయాల నుంచి శివలింగం వచ్చింది. ప్రతిష్ఠ జరిగింది. పూజారి పుట్టాడు. నిత్యనైమిత్తక కర్మకాండ ప్రారంభమయింది. ధూపదీప నైవేద్యాదులకు కొదవలేకుండా పోయింది. నైవేద్యం పెడుతుంటే చాలు.అంతమంది పిల్లలు కాలనీలోఎక్కడున్నారో అంతపెద్దక్యూ.

శాంతమ్మ వచ్చిఎదురుగా నిలబడి, ఒకరోజు 'అయ్యా' అంది. అప్పుడే పిల్లలు నైపథ్యంతో వచ్చి ఇంట్లో పంచుతున్నారు. చేతులు నులుంకొంది.తలగీక్కుంది. పైట కొంగుకుచేతులు తుడుచుకొంది. కసువు ఊడ్చి, అంట్లు తోమి వచ్చింది.

"డబ్బు కావాలా" అన్నాడు వినాయక్ "కాదు" అంది "రేపటినుంచి పనికి రానుంది. రాలేనంది రానియ్యంది. మీరంటే ఇష్టమేనంది. పనిమానటం ఇష్టం లేదంది. కానీ తప్పదంది. ఎందుకని? అడిగాడు. జీతం చాలటం లేదా? ప్రశ్నించాడు. కాదంది. పైట కొంగు చేతికి చుట్టుకొంది.మూతికి చేయిఅడ్డం పెట్టుకొంది. నెమ్మదిగా నోరు తెరిచింది. 'అయ్యా'అంది. 'ఊ' అంటే మీరజనులా? అని ప్రశ్నించింది. పైట చెంగు కొంగు అంతానోట్లో కుక్కుకొంది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

అతనికి విషయం అర్థమైపోయింది. ఆమెనుచూస్తుంటే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కళ్ళుకనిపిచంటం లేదు. దృష్టి మందగించింది.చూపు లేదు. పొగనుంచి చలి, ఈగవ, ఎదుటమనిషి కనిపించడం లేదు.

శాంతమ్మ ఏడుస్తుందనిపించింది. ఉన్నట్టుండి వంగింది.కాళ్ళు తాకింది. కాళ్ళు వెనక్కులాకుంది. లేచి,వంగి తప్పుకొని తలుపుదాకా పోయింది. వెనుదిరిగి చూచి వెళిపోయింది. ఆరోజు మిగిలిన అన్నం శాంతమ్మ తినలేదు.తీసుకొని పోలేదు.

మూణ్ణెల్లు పనిచేసింది.తల్లో నాలుక.మంచి మనిషి. ఇంట్లో అందరికీ ఇష్టం. పొద్దుటా సాయంకాలం వచ్చేది. మిగిలిన అన్నం తినేది. ఇంకా ఉంటే తీసుకొని పోయేది. కసువు

ఊడ్చటం.అంట్లు తోమటం ఫరవాలేదు.నీళ్లు తెచ్చేది. నీళ్లే సమస్య. ఆమెలేకపోతే నీళ్ళతో పెద్ద కష్టం.

మళ్ళీ మామూలే. పని మనిషి కోసం కాసుల వేట. ఎవరో దొరికే వాళ్ళు. పది రోజులు పనిచేసేవాళ్లు .అంగడికి పోయినప్పుడో, నీళ్ళకు పోయినప్పుడో ఎవరెవరో ఏమేమో అడిగేవాళ్ళు. ఏమేమోచెప్పేవాళ్లు.

వాళ్లూ వీళ్ళు అన్నవీ విన్నవీ కొందరు అడిగేవాళ్ళు.కొందరు అడక్కుండా మానేసేవాళ్ళు. పనివాళ్ళతో కష్టంగా ఉందంటే తోటి లెక్చరరు పల్లెనుంచి పిల్లవాణ్ణి పిలిపించాడు. పిల్లవాడు చురుకుగా ఉన్నాడు. చలాకీగా ఉన్నాడు.బలహీనంగా దిగులుగా వచ్చాడు. తిండి లేదు. బట్టలేదు. పెరిగే వయస్సులో పిల్లవాడు వంగిపోయాడు. చదువూలేదు. ఊళ్లో గొడవలు తెస్తున్నాడు. దొంగబుద్ధి. జాగ్రత్త హెచ్చరించాడు తోటి లెక్చరరు. హరిజనుల పిల్లవాడు.

పిల్లవాడు పని బాగా నేర్చుకొన్నాడు. ఆరోగ్యం కుదుటబడింది. కొత్త బట్టలు వచ్చాయి. కంటికి నిద్ర దొరికింది. కడుపుకు కూడుకుదిరింది. అతనికి పిల్లవాడంటే ప్రేమ. అవసరమైె ప్రేమ కొంత. అతడి హరిజనత్వంమీద జాలి కొంత. మొత్తం మీద వాణ్ణి బాగా చూచుకొంటున్నారు. వాడి చదువు మీద భవిష్యత్తు మీద అతను దృష్టి సారించాడు.

మీరు ఫలానా అంట గదా, మీ ఇంట్లో నేను పనిచేయకూడదంట గదా అని పని మానేసి పల్లెకు వెళ్ళిపోయాడు, అతడి కళ్ళు చెమ్మగిల్లాయి.

సొంత ఇంటికి రాకముందు అద్దె ఇంటిలో ఉన్నప్పుడు ఇంట్లో బీబీ పని చేసేది. ఇంట్లో అన్ని పనులూ చేసేది. దొంగతనం చేసిందని ఆమెను పని మాన్పించింది.భాగీరథి పని మానటం ఇష్టంలేక ఏడుస్తూ పనిమానింది బీబి. పనివాళ్ళతో విసుగురావటంతో మళ్ళీ బీబికి ఆమె కబురు పంపింది. ఆగమేఘాల మీద వచ్చింది బీబీ. పెట్టె సంచీ తీసుకొని మరి వచ్చింది. ఇంట్లో ఉండి పోవటానికే వచ్చింది. తపోవనంలో పనిచేసి రోజూ రైలుస్టేషన్ దాకే వచ్చిపోవాలంటే అయ్యే పనికాదు. భాగీరథి రాజీపడింది. బీబీని రానిచ్చేది కాదు. దొంగబుద్ధి ఉన్నా మన జాగ్రత్తలో మనముంటేసరిపోతుంది కదా ఆమె సర్దుబాటు చేసుకొంది. పైగా ఇంట్లో తాము లేనప్పుడు మనిషిఉండడం మంచిదేకదా! ఇల్లు కొంచెం పెడగా కూడా ఉంది.

మళ్ళీ పనివాళ్ళతో సమస్య రాలేదు. గొడ్డు చాకిరీ చేసేది. వస్తాదులాగా తినేది. దెయ్యంలాగా నిద్రపోయేది.భర్త వదిలేశాడు. పిల్లాజెల్లా లేరు. తల్లితండ్రులు దగ్గరకు పోదు,

వాళ్ళ రారు.ఏభైఏళ్ళ దాకా ఉన్నా, ఆరోగ్యం చెడలేదు. ఒక్కరోజుకూడా తుమ్మలేదు. దగ్గ లేదు.ఆ కొక్క పుగాకునములుతుంది.నోటినిండా ఆ కొక్క ఎప్పుడూ ఉంటుంది. అదీ అవస్థే. అమె దగ్గర పిల్లలంతా మాలిమి.

వినాయక్ మంచం ఇంట్లోకి తెచ్చుకొంటున్నప్పుడు లేచిఇంటి ముందు నీళ్ళు చల్లుతూఉంది. చెంబుభాగీరథికి ఇచ్చాడు. టేబిల్ దగ్గర కూరుచుని హోంవర్కు చేసుకొంటున్నవాళ్లనుచూస్తూ ఉన్నాడు. చివరి నాడు మాత్రం అమ్మ ఇంకా పక్కలోనే ఉందనుకొని నిద్రను వాటేసుకొని పడుకున్నాడు.

మసక మసకగా తెల్లవారింది. జనం రద్దీ పెరిగింది.సైకిళ్ళు, రిక్షాలు,రాకపోకలు పెరిగాయి. బృహదీశ్వరాలయంలో గీతోపదేశం రికార్డు పెట్టారు. గుడి గంటలు రికార్డు మ్యూజిక్కులో కలిసిపోయాయి.

'కర్మణ్యేవారాధి కారస్తే' రికార్డు అరిగిపోయింది.కర్మణ్యేవ మళ్ళీ మళ్ళీ వినపడుతూ ఉంది. అరిగినా మంచి పనే అయింది. పూజారి ఎప్పుడూ వింటాడో, ఎప్పుడుమేల్కొంటాడో ఎప్పుడురికార్డు సరి చేస్తాడో అంతదాకా ఈ గీతోపదేశ సంగీత హింస భరించక తప్పదు.

రాత్రి బైట మంచం దగ్గరకు వచ్చి, నీళ్ళిన భాగీరథి అడిగింది.

'బాయిలో నీళ్ళు పడతాయా'

'ఆఁ'

'అంత నమ్మకమా'

'ఆఁ'

'ఏమిటింత నమ్మకం'

'మనం ఎవరికీ హాని చేయలేదు.మనకెవరూహానిచేయరు. ప్రకృతి అయినా భూమి అయినా గాలి అయినా బండయినా దేవుడయినా సరే అయితే ఇంకా ఖర్చు ఉంటుంది కదా!'

'ఉంటుంది. బావి చుట్టూ గోడ కట్టించాలి. చప్టా వేయించాలి.గిలక వేయించాలి.'

'బాగుంటుంది.' అంది తృప్తిగా 'నీళ్ళు పడాలి కదా' అంది బెంగగా. 'గోవిందు వాళ్లు వస్తారా' ప్రశ్నించింది.

వస్తారు. పేలుస్తారు. నీళ్ళు పడతాయి. తోడుకుంటాం. ఎవరు కావాలన్నా నీళ్ళు తోడుకోనిస్తాం. అన్నాడు అని వాళ్ళు తోడుకొంటారోలేదో అన్నాడు నీళ్ళు తోడిపోస్తాం అన్నాడు పోయించుకొంటారో లేదో సందేహించాడు.

ఒక పనిచేద్దాం. అన్నాడు ఉత్సాహంగా. 'మిషనుపెడదాం. పైపు వేద్దాం. పైపు వీధిలోకి తెద్దాం. కుళాయి పెడదాం. ఎవరుకావాలన్నా నీళ్ళు పట్టుకుపోతారు. ఇక ఎవరికీ ఏ సందేహమూఉండదన్న సంతోషం కలిగింది.

"మన నీళ్ళు వాళ్ళు తాగవచ్చుకానీ,మనమంటుకొనే బావి వాళ్లు తాకరాదు. అంతేనా?"

'అవును.' అన్నాడు

'మనమా తేడా పాటిస్తామా'

'మనకోసం కాదు. వాళ్ళు మరీ మడీ అంటారు కదా. వాళ్ళకే కష్టమూ లేకుండా చేయటానికి ఏర్పాటు బాగుంటుంది.'

భాగీరథికీ జవాబు ఇష్టం లేదు.

"మన మీద వాళ్ళు పాటించే నియమాలను మనమీద మనమే వాళ్ళకోసం పాటించటం బాధగా లేదా?"

అతను బిత్తరపోయాడు. ఆమె అంతలోతుగా ఆలోచిస్తుందని కొత్తగా తెలుసుకొన్నాడు. సంతోషం కలిగింది. చూడునాదొక గర్వం అహంకారం. పొగరు. నా నీళ్ళు తాగారన్న తృప్తి మా నీళ్ళు వీళ్ళదాహం తీర్చాయని. తిండి వండి పెట్టాయని స్నానంతో శరీరమంతా తాకాయని అనుకొనటం ఆనందం. అదొక అతిశయం. వాళ్ళకు ఇష్టమయ్యేటట్లు మన నీళ్ళు వాళ్ళకిద్దామని ఆలోచన. స్వార్థం అహంకారం,

'నీళ్ళిద్దాం. అడ్డగించవద్దు. కావలసివస్తే తొడుకొన్నిపోతారు. మిషనుపెట్టటం పైపు వేయటం, కుళాయి బిగించటం అంతా దండగమారి ఖర్చు. ఖర్చు మాట అలా ఉంచండి. వాళ్ళ నీళ్ళు తాగాలన్న ఆరాటంతో మన అనర్హతకు సంబంధించిన అయిష్టం లేకపోలేదు.'

ఆమె అంతస్తు తాను అందుకోలేనంత ఎత్తులో ఉందని అనిపిస్తూ ఉంది. నిజానికి ఆమె ఆలోచన సూటిగా ఉంది.అతనికి సంతోషం కలిగింది.

అతనికి ఆలోచన తెగలేదు.తనమాటలు మలినరహితం కావు.తన గంగ వాళ్ళు తాగాలనుకోవటం ఎంతో కొంత మలినం లేకపోలేదు. నీటికి ఏ పాపం లేదు. దానికి మాలిన్యం జనం వల్ల సంక్రమిస్తుంది. బావినీరు ఎవరి సొంతమూ కాదు. బావి సొంతం. నీరుకాదు.అది దైవదత్తం.అది జనం నీరు. అది అవసరమైనవాళ్ళకు అనుగ్రహం. భూమి స్తన్యం. ఏ బిడ్డ అయినా తాగవచ్చు.దానికి ఏ పంకమూ అంటదు. జనం తలకాయల మురికి ఆలోచనల బురద దానికి అంటిస్తున్నారు. నీటికి మురికిలేదు. భేదం లేదు. తేడా లేదు. స్పృశ్యం, అస్పృశ్యంలేదు.జలం అఖండ పావిత్ర్యం.

భర్త ఆలోచన మైకం నుంచి తిమ్మిరి నుంచి మేలుకోకముందే భార్య నెమ్మదిగా అంది. 'అలులేదు. చూలులేదు. కొడుకు పేరుసోమలింగం అన్నట్లుంది. బండ పగలాలి. నీళ్ళుండాలి. పడాలి. మన ప్రాప్తం ఎట్లుందో'ఏమో.

బిత్తరపోయిన భర్త క్షణకాలం నిరుత్తరుడయ్యాడు. వెంటనే అలు ఉంది. చూలుంది ప్రసవమే కావాలి. అది అగదు.

ఏమో!

బండబద్దలవుతుంది.వరద ఉప్పెనలాగా జలపడుతుంది. నీరొస్తుంది. బావి నిండుతుంది. మనం తాగుతాం జనం తాగుతారు.పిల్లలుసంతోషిస్తారు.కాలనీ ఆనందిస్తుంది.

దూరంగా అనంతపురం అవతల బుక్కరాయ సముద్రం పక్కగా దేవరకొండ మీదుగా నెత్తురు ముద్దలాంటి సూర్యుడు ఉదయించాడు. బావిలో జలపడితే నీరొచ్చినట్లుగా వెలుగుకిరణాలు భూమిని కావిలించుకొంటున్నాయి.

అనంతపురం నుంచి సూర్యుణ్ణి నెత్తిన మోసుకొంటూ గోవిందు వచ్చాడు. భుజాన పికాసి ఉంది. కొడుకునూ భార్యనూ వెంట తీసుకొని వచ్చాడు. వాళ్ళు బరువుగా గంపలు మోసుకొచ్చారు.

గోవిందుచొక్కా విప్పి పక్కన పెడుతున్నప్పుడు వాళ్ళు మేకుకు తాడుకట్టి లోపలికి వదిలారు.గంపల్లో తెచ్చిన సామాను సర్దుతూ ఉన్నారు.

గోవిందు మేకు గట్టి చేసి, తాడు లాగిచూచి.ఉలి, సుత్తి, బొడ్లో దోపి,బావికి దండం పెట్టి తాడు మీదగా బావికన్నాల లోనుంచి లోపలికి దిగాడు.మరుక్షణం పని ప్రారంభించాడు. బండ తొలుస్తున్నారు.

బీడి ముట్టించుకొన్న కొడుకు పొగ పీలుస్తూ తాడుమీదగా లోనికిదిగాడు. బావి గట్టుమీద ఆమెకూర్చునిఉంది. తండ్రీకొడుకులు ఆ బీడినే మార్చి మార్చి తాగుతున్నారు. ఇద్దరూచెరొక తొలి చేస్తున్నారు.

బెణుకప్పవచ్చాడు. తొంగి చూశాడు. 'ముళ్ళా వనా?' అన్నాడు.అతను ఔనన్నాడు.అటంకంలేని ఆకాశం నుంచి సూర్యుడి ప్రతాపం నేలనుతాకుతూ ఉంది.ఇంకా నేల వేడెక్కలేదు. కొండగాలి తోలుతూ ఉంది.చల్లగా ఉంది. భాగీరథి కాఫీ తెచ్చి ఇచ్చి బావిలోకి తొంగి చూచి, భర్త ముఖంలోకి పరామర్శగా చూచివెళిపోయింది.

ఇంట్లో నలుగురూ సందడి ప్రారంభించారు. పొరుగిళ్ళ పిల్లలు తోడయ్యారు. వాళ్ళదెంత మధురమైన గోల! ఎంతో హాయిగా ఉంది. అతను లెక్చరరు కావటం వల్ల, గంటల

తరబడి పాఠాలుచెప్పటం వల్ల, శబ్దమంటేఇష్టమై, నిశ్శబ్దమంటే అయిష్టమయి పిల్లల ఆటల అల్లరి ఇష్టం కాబోయినని ఆమెకు అనిపిస్తుంది. ఆమెగోల భరించలేదు. ప్రశాంతంగా ఉండటం ఇష్టమంటుంది.

భర్త కొన్నిసందర్భాలలో తనలోకి తానుకుంచించుకొనిపోయి గంటల తరబడి ఏకాంతంగా కూర్చుంటాడు. అంత ఏకాంతంగా అంత నిశ్శబ్దంగా ఇంత అల్లరి, ఇంత గోల భరించే మనిషి ఉండగలగటం ఆమెకు ఆశ్చర్యంగా ఉంటుంది.

ఇంతకాలం నిశ్శబ్దంగా ఉన్న బావినిచూడాలంటే ఆమెకు భయంగా ఉండేది. బండ తొలుస్తున్న మోతకి బావి శబ్దమై ప్రతిధ్వనిస్తూ టంగ్ టంగ్ శబ్దం ఆమెకు భరింపశక్యం కాకుండా ఉంది.బావి వబ్దం అమిత ఇష్టంగా ఆలకిస్తూ ఉన్నాడు భర్త. పని లేకపోయినా అటుఇటూ తిరుగుతూఉన్నాడు.

బృహదీశ్వరాలయానికి వచ్చే వాళ్ళు పోయేవాళ్ళు అంతులేదు. ఇంటి దగ్గరకు వచ్చి బావిలోకి తొంగిచూచి "బావిపనా?" అంటున్నారు. 'బండ పడిందా?' అంటున్నారు. కష్టమే అంటున్నారు. వెళ్లిపోతున్నారు. ఒకే సమాధానం చాలామందికి చెప్పవలసి వచ్చింది. అవునన్నాడు. అవునవునన్నారు.ముందుముందుగా జవాబులు చాలా సేపు చెప్పాడు. రానురాను అవునుతో ముగించాడు. ఔతో ఆపాడు. తల ఊపాడు. కళ్లు కదిపాడు. ఇక ఏమీ జవాబు లేక నీరసంగా ఇంట్లోకి వచ్చికూర్చున్నాడు.

ఆమె గుడికెళ్ళి వచ్చింది. టెంకాయ కొట్టింది.ప్రదక్షిణం చేసింది. ప్రసాదం తీసుకొంది. తండ్రీ కొడుకులకు ప్రసాదం పెట్టు మరిని గోవిందు భార్యకిచ్చింది. ఆమెచిప్ప పగలగొట్టి కొబ్బరి తీసి, ముక్కలు చేసిఅందరికీ పంచి, బావిలోకి విసిరింది. వాళ్ళిద్దరూ బీడి పంచుకొన్నట్లు కొబ్బరి పంచుకున్నారు. దాన్నికాల్చేవాళ్ళు దీన్నితిన్నారు.

పొద్దుబారడెక్కింది. పిల్లలు జట్లు జట్లుగా వచ్చి బావిలోకి తొంగి చూచి, మట్టి గుట్ట మీదకెక్కి జారిపోతున్నారు. వదిలేసిన బావి పని మళ్ళీ మొదలు పెట్టారని అందరికీ ఆసక్తిగా ఉంది.

'నీళ్ళు పడతాయంటావా?' బెణకప్ప అడిగాడు.

ఆఁ అన్నాడు. నలుగుర్నీ అడిగానన్నాడు. అడిగి మళ్ళీ పని మొదలుపెట్టించానన్నాడు.

పది గంటలకు తండ్రీకొడుకులు కూడబలుక్కొని బావిలోంచిపైకి వచ్చారు. కాళ్ళూ చేతులూ కడుక్కొని గోడ వారన కూర్చున్నారు. ఆమె ముద్ద పెట్టింది. ఎర్రగారం రాగి ముద్ద ఆరగారగా తిన్నారు. నీళ్ళిచ్చింది. తాగారు. చెట్టు నీడన మొదట్లో తలకింద

చుట్టుకదురు పెట్టుకొని వెల్లకిలా పడుకున్నాడు గోవిందు. తల్లీ కొడుకు కూర్చుని కబుర్లు చెప్పుకొంటున్నారు.

ముఖంలోకితొంగి చూస్తున్న వినాయక్‌తో గోవిందుచెప్పాడు.

'నాలుగు తొలులు'

'ఇంకెన్ని'

'రెండు'

'చాలా'

'సాల్నాలు'

అలసట దీరి,ఆకలిదీరి విశ్రాంతి సరిపోయి తండ్రీకొడుకులు బావిలోకి దిగబోతున్నప్పుడు అతనడిగాడు.

'లో తెంత?' లోతు గురించి.

'నాలుగైదంగుళాలు'

'చాలా'

'కొల్లకి, సాల్నాలు'

ఇద్దరూ బావిలోకి దిగారు. పని మొదలుపెట్టారు. బండలో ఉలి రంధ్రం చేస్తుంది. సుత్తికొడుకుతుంది. అంగుళం అంగుళన్నర వెడల్పుతో నాలుగైదు అంగుళాల లోతుకు తొలిచేస్తారు.ఉలి పొడుగు ఆరంగుళాలు అంతకంటే లోతుగా తొలిచేయటం సాధ్యంకాదంటాడు గోవిందు.అటువంటి తొలులు ఆరుకావాలంటాడు.

కాఫీ తెచ్చిన బీబీ చెప్పింది. లోనికి రావల్లంట అమ్మయ్య చెప్పె.

'వస్తున్నాను పద!' వెళిపోయింది.

ఏమవుతుందో నీళ్ళు పడతాయోలేదోనన్న బెంగతో ఆమె కూర్చుంది. పిల్లలు ఇంటిపట్టునలేరు. పిలిచినా పలకరు.రారు ఎక్కడ ఆడుకొంటున్నారో ఏమో!

లోపలికి పోయి, భార్యను పలకరించి, ధైర్యం చెప్పి, నీళ్ళు పడతాయని భరోసా ఇచ్చాడు. బతుకు జూదమయి పోయింది. ధర్మరాజుకే తప్పలేదు. వ్యసనం కాదు. వ్యవహారం. దాని తీరే అంత. ఆడి తీరాలి. గెలుపో,ఓటమో మన చేతుల్లో ఏమీ లేనట్లుగా ఉంటుంది. ప్రయత్నం మనవంతు. పిల్లల అదృష్టం. ఈ పరిస్థితుల్లో కొండకి వెంట్రుక కట్టాడు వస్తే కొండ వస్తుంది. పోతే వెంట్రుక పోతుంది. ఈ వెంట్రుకే మనకుపెద్ద బరువు. పెద్ద అప్పు.

భార్యఅడిగింది."కొండ వస్తుందా?"

"వస్తుంది"

"బండ పగులుతుందా"

"పగులుతుంది." బైటికి వచ్చి బావి చుట్టూ తిరుగుతున్నాడు.

వినాయక్ తానుచేయగలిగింది చేస్తాడు. చేయలేనప్పుడు కాలు కాలిన పిల్లిలాగా తిరుగుతాడు. ఇప్పుడిలా తిరగటం అతని అశక్తై కే గుర్తు. తానేమీ చేయలేని పరిస్థితి ఉన్నప్పుడు ఇలాగే తిరిగేవాడు. భార్యకు హాస్పిటల్లో లేబర్ వార్డులో కాన్పు అవుతుంటే వరండాలో ఇలాగేతిరిగాడు. ఒక్కసారి గాదు. నాలుగుసార్లు. ఇది సరిగ్గా అటువంటి పరిస్థితి. ఈ తిరగడం అతడి అసహాయస్థితికి గుర్తు! ఆందోళనకు నిదర్శనం. బాధ సంకేతం చింతకు కార్యరూపం!

ఏమీ చేయలేమని తెలిసినా మనిషి ఆరాటం, పోరాటం తప్పవు. ఊరికే కూర్చోలేడు. నిలబడలేడు. తిరగలేడు. బావిలోకి తొంగి చూచి, తిరిగి రావటం నూటొక్కటోసారి. ఊరికే,ఏమీ లేదు. పనీ లేదు. ఉండలేడు. చూడలేడు. చూడకుండా ఉండలేడు. ఆదో జీవనసమరం.

తండ్రీకొడుకులు బండ తొలుస్తున్నారు. నీళ్ళు చల్లుతున్నారు. ఉలితోబండకు బొక్క పెడుతున్నారు. ఒక్కొక్క పెచ్చులేచి పోతూఉంది. బండ మీద రంధ్రంలో ఉన్న ఉలిని ఎడం చేత్తో పట్టుకున్నారు. కుడిచేత్తో సుత్తితో కొడుతున్నారు. రవ్వలు లేస్తున్నాయి. నీళ్ళు పోస్తున్నారు. అణువణువూతొలుచుకొంటూ పోతున్నారు. అదే పని. కొట్టిందే కొట్టటం. చేసిందే చేయటం. గంటల తరబడి. అవే చేతులు, అదే పని,అదే పద్ధతిలో, అదే లయలో, అలాగే క్రమంగా వరుసగా ఒకే మూసలో ఒకే మోతతో,ఒకే వేగంతో ఒకే జాగ్రత్తతో,ఒకే ఒడుపుతో క్రమంగా తొలిచేస్తున్నారు.

నిజానికీ పని చూడడానికి విసుగుగా ఉంటుంది. చిన్నప్పుడు తప్పు చేస్తే గుంజీళ్ళు తీయించేవాళ్ళు. ఒకే పని వందసార్లు దయతలిస్తే యాభై సార్లు చేయాలి. అలుపు కాళ్ళు నొప్పి, కీళ్ళు వణకటం, చెమట, కన్నీరు, ఏడుపు చిన్నప్పుడు తప్పురాస్తే నూరుసార్లు రాయాలి.అవే వాక్యాలు. రాసీ రాసీ చేయి నొప్పి మాష్టర్నితిట్టటం.తప్పునుతిట్టటం.గోవిందు అదే పని. అదేక్రమం. ఎవర్నీ తిట్టడు. జీవితాంతం అదేపని.ఓర్పుగా ఎన్ని బావులు తవ్వాడో ఎన్ని తొలులు వేశాడు. వంగిన నడుంకు తెలుసు. గడచిన కాలానికి తెలుసు. బావిలో నీళ్ళు పడితే తానను భవించడు. ఆనందిస్తాడు.అనుభవించేవాళ్ళనుచూచి ఆనందిస్తారు. గంగనుచూచి పొంగిపోతాడు. ఇలా పొంగిపోవటం కోసం ఎన్ని రోజులు ఈ పోరాటం!

గుంజీళ్ళకు ఒక ముగింపు ఉంది. ఉలిదెబ్బలకు ముగింపులేదు. ఒక్క తొలికి ఎన్నిదెబ్బలు. లెక్కలేదు. తొలులు ఆరే! దెబ్బలెన్ని! బండను బట్టి! బండ సాంద్రతను బట్టి ఉలిపదును పెట్టి,సుత్తి వేణును బట్టి. చేతిబలం బట్టి, సంకల్పబలం బట్టి ఎన్ని దెబ్బలు

తండ్రీ కొడుకులు నాలుగు చేతులుగా మాత్రమే కనిపించారు. కాలం గడుస్తూ ఉంది. వాళ్ళ చేతులు ఉలులుగా, సుత్తెలుగా మారాయి. రెండు ఉలులు,రెండు సుత్తెలుగా మారారు. చూస్తూఉండగానే వాళ్ళు ఆరు తొలులై బయటపడ్డారు. మనుషులు మాయమయ్యారు. పనిగా మారారు. పని మాత్రమే కనపడుతూ ఉంది. ఫలితం మాత్రమే కనపడుతూఉంది. ఉపయోగం ఎదటపడింది. అవసరమే ప్రత్యక్షమయింది. ఇప్పుడు నిరుపయోగం దృష్టి గోచరం కాదు. అవసరమైతే అగుపించదు. వాళ్ళిద్దరూ నిరుపయోగమయ్యారు. వాళ్ళ అవసరం తీరిపోయింది. ఆరుతొలులు నోళ్ళు లాగా గొంతు తడార్చుకొంటున్నాయి. ఇంట్లోని ఆరునోళ్ళు లాగా ఆరుతొలులు. మనిషెంత స్వార్థపరుడు. జీవించినంతకాలం తనకోసం తనెంత తపన పడతాడు. వినాయక్‌కి కళ్ల తిరిగినట్లు అనిపించాయి. బావిలోకి చూడడం మానేశాడు. సూర్యుడివైపుతలతిప్పాడు. సూర్యుడు నెత్తిమీదికి రావటానికి అంగలు పంగలు చాచి చాచి వేస్తున్నాడు.

గోడ వార నీడలో బీబీ కుర్చీ తెచ్చివేస్తే అతను కూర్చున్నాడు. తండ్రీ కొడుకులు బావిలోంచి పైకివచ్చారు. కాళ్ళు చేతులుకడుక్కున్నారు. ముఖం మీద నీళ్ళు చల్లుకొన్నారు. గోడవారకు వచ్చారు. గోడకువీపులు మోటించి కింద కూర్చున్నారు. గోవిందు భార్య ఎదురుగా వచ్చి నిలబడింది. ఏమీ ఎవరూ మాట్లాడుకోలేదు.

"తొలులు అయిపోయినాయా"

'ఐపాయ'

"సరిపోతాయా"

"సుడీ కొల్లకి"

మళ్ళీ ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

వినాయక్ వాళ్ళ దగ్గరే ఉన్నాడు. మనస్సు లేదు. అది ఇల్లు వదలి, బృహదీశ్వరాలయం దాటి,వీధి చివరి దాకపోయి, పొలాల్లోకి వెళ్ళి బలుబుల ఫేక్టరీ పైన విశాలమైన మైదానంలోకి తేరిపారచూస్తూ ఉంది. ముళ్ల గడ్డి ఎండిపోతే ఎవరో నిప్పు పెట్టారు. పొలం తగలబడుతూ ఉంది. మంట! పొగ! నల్లగోబూడిద. నేలకాలిన మచ్చ!

వానలు పడి, నేలకొత్త చిగుళ్ళు వేయటానికి ఎండుగడ్డి ఎండాకాలం నుంచి పొక

తప్పదు.గడ్డీ మామూలే. మంటా మామూలే! వానలుపడతాయా? మోళ్ళు చిగుళ్ళు వేస్తాయా? అతడి ఆశలు చిగుళ్ళుతొడిగాయి. పొలాల్లో తిరిగివచ్చిన అతడి మనస్సు ఇల్లు చేరే సరికి గోవిందు బావిలోదిగటానికి సిద్ధమవుతున్నాడు.

ఆరు తూటాలకు వైర్లు తొడిగాడు. వాటి చుట్టూ తాడు గట్టాడు. తాడు బొడ్లో దోపుకున్నాడు. మేకుకుట్టిన మోకులాగిచూశాడు. బావికి దండం పెట్టాడు. లోపలికి దిగాడు.

కొడుకు లోపలికి దిగలేదు. ఒడ్డునే ఉండిపోయాడు. లోపలికి దిగిన గోవిందు బీడీ తాగటం లేదు. మాస్టర్ని చూచి,పుస్తకాలు సర్దుకొంటున్న ఒకటో తరగతి పిల్లాడు లాగా ఉన్నాడు.దేవుడి దగ్గర తీర్థ ప్రసాదాల కోసం దోసిలి పట్టిన భక్తుడిలాగా ఉన్నాడు.

ఆరుతొలుల్లో తడి గుడ్డతో తుడిచాడు పూర్తిగా తుడిచాడు. పొడిగా చేశాడు. బండ శుభ్రంగా ఉంది.తాగిపారేసిన బీడీ ముక్కలు ఏరి బొడ్లో దోపుకున్నాడు. ఏ మురికీ లేదు. తొలులు కళ్ళె. బండదేవత లాగా ఉంది. గంగాభవానిలాగా ఉంది.

బొడ్డులో నుంచి తాడులాగాడు. వేలబడుతున్న తూటాల కట్ట చేతికి వచ్చింది. కట్ట విప్పాడు.ఒక్కొక్కతూటా ఒక్కొక్క తొలిలో పెట్టాడు. అది దాదాపు మునిగిపోయింది. తొలిలో ఆరు తూటాల వైర్లుచేతబుచ్చుకొన్నాడు. వైర్లు లాగి చూశాడు. తూటాలుకదలకుండా తొలుల్లో కూర్చాడు.వైర్లు చివర్లు కలిపికట్టాడు. పైకి చూశాడు. భార్య, కొడుకు, వినాయక్, భాగీరథి పిల్లలు తొంగి చూస్తున్నారు. పైకి వచ్చే మోకు కట్టిన మేకునుగట్టి చేయమన్నాడు.మోకులాగి చూశాడు. గట్టిగా ఉండదనుకొన్న తరువాత చెప్పాడు.

ఈ సగాలికి ఎవుల్నూ రావొద్దు. అరవండి. పొండి, భార్య ఒకపక్కకు కొడుకు మరోపక్కకి వెళ్ళారు. జనం రాకపోకలు ఆపారు. బావి చుట్టూ వంద గజాలుదూరంగా జనాన్నిఆపారు.

'మీరు పొండి సావీ' అన్నాడు గోవిందు

గోవిందును ఒక్కణ్ణే అక్కడ వదలి వెళ్ళటం అతనికిష్టం లేదు. ప్రమాదం తెలిసిందే.

'ఇంట్లోకిబో సావీ'

అందరూ ఇంట్లోకి పోయారు. తలుపులుకిటికీలు వేసుకొన్నారు. కిటికీ కొంచెం తీసి అతనుబావి వైపు చూస్తున్నాడు.

తూటాలు పేలినప్పుడు రాళ్ళు పగిలిపైకి లేస్తాయి. చాలాబలంగా లేస్తాయి. పైకి లేచిన రాయి బండా రాతి ముక్క మీద పడితే తల పగులుతుంది బండ పేలినప్పుడు మరీ కష్టం. ప్రాణాపాయంకూడా ఉండవచ్చు.

చుట్టుపక్కల వాళ్ళ అరుపులకు జనం ఆగిపోయారు. ఎక్కడివాళ్ళు అక్కడ

నిలబడిపోయారు. మనుషులు, సైకిళ్ళు రిక్షాలు ఎక్కడివక్కడ బంద్! కర్ఫ్యూ విధించిననగరంలాగా రోడ్డుమారిపోయింది. బావి చుట్టూ పిట్ట కూడా మెదలటం లేదు.

బావిలో గోవిందు వైర్ల చివర్లు అన్నీ కలిపి కట్టిన తాడు మళ్ళీ లాగిచూచి ఒక చోటపెట్టాడు. పైకిచూశాడు.

వాటిని అంటించాలి. ఆరు ఒకేసారి అంటుకోవాలి. వాటి కొసలన్నీ ఒకే కుదురుగా ఉన్నాయి.అంటించిన తరువాత తాడు మీదగా బావిలోంచి పైకి ఎక్కిరావాలి. దూరంగా పోవాలి. గోడవారకయినా చేరాలి. చెట్టుకిందకయినా చేరాలి. వైర్లు కాలి, తూటాలు పేలి, రాళ్ళు పగిలి, పైకి ఎగిరేలోగా వాటికి దొరకనంత దూరంగా సురక్షితంగా పోవాలి. బావిలోంచి వేగంగా ఎక్కలేకపోయినా దూరంగా పోలేకపోయినా ప్రమాదమే!

అంతా సవ్యంగా ఉందనుకొన్న తరువాత అగ్గిపుల్ల తీశాడు. ఏం పొరపాటుచేసినా గోవిందుప్రాణానికి ప్రమాదం.

ఆరువైర్లు కుదురుగా పెట్టి అగ్గిపుల్ల గీసి అంటించాడు. వైర్లు అంటుకొన్నాయి. ఆరూ అంటుకొన్నాయని నమ్మకం కుదరగానే తాడుపుచ్చుకొన్నాడు. నెమ్మదిగా ధైర్యంగా బావి గోడ కన్నంలోకాలుపెడుతూఒక్కొక్కకన్నం దాటుతూ, మోకు మీదుగా గోవిందు, ప్రైమ్మినిస్టర్ ఉపన్యాసం ఇచ్చినట్టుగా శ్రీనివాస్ మాండలిన్ వాయించినట్లుగా ఘంటసాల పాడినట్లుగా పైకి పైపైకి సాగి ఎక్కి వస్తున్నాడు. వస్తూ వెనక్కు చూశాడు. వైర్లు అన్నీ అంటుకొన్నాయి. అన్ని వైర్లు కలిసికట్టిన దారం ఊడిపోయింది. వైర్లు వేరు వేరయ్యాయి. ఏ తూటా దగ్గరకు వైరు చురచురమను కొంటూ పోతూ ఉంది. బలియార్డ్ బంతుల్లాగా చెల్లా చెదురుగా మండుతున్నాయి. ఎవరి క్లాసుకు వాళ్ళు వెళ్ళేస్కూలుకు ఆలస్యమయిన పిల్లల్లాగా చకచకా మండుతున్నాయి వైర్లు.

గోవిందు పైకి ఎక్కివస్తున్నాడు. వినాయక్ కిటికీలోనుంచి గోవిందు తలచూశాడు. ఇంకా పూర్తిగా గోవిందు పైకి రాలేదు.

ఉన్నట్టుండి పెఠిల్లుమని శబ్దం వినబడింది.బావి చుట్టూ వందగజాల దూరం నుంచి అల్లకల్లోలంగా అరుపులు, అంతలోనే నిశ్శబ్దం.బావిలోంచి ఎక్కివస్తున్న గోవిందు గట్టుమీదికి ఎక్కి నట్టు రాలేదు. తోసినట్లు వచ్చాడు. నెట్టినట్లు వచ్చాడు. ఎక్కినవాడు నిలబడలేదు. కూలబడ్డాడు. కాళ్ళూ చేతులుకూడదీసుకొని చెట్టుకిందికిపోయాడు.

మళ్ళీ శబ్దం. పిడుగు పడ్డట్టుంది. బండ లేచింది. చెట్టుమీద పడింది. కొమ్మ విరిగింది. గోవిందు చెట్టుకింది నుంచి కుంటుతూ కుంటుతూనడిచిపోయాడు.

మళ్ళీ శబ్దం. ఉరుమురిమినట్లు గోవిందు కనబడడం లేదు.ఏమయ్యాడు? కూర్చున్నాడా? నడుస్తున్నాడా? దూరంగా పోతున్నాడో?

మళ్ళీ బలంగా రెండు మేఘాలు ఢీకొన్నట్లుగా పిడుగులుపడుతున్నట్లుగా శబ్దాలు. రాళ్ళు ముక్కలై వాన కురిసినట్లు పడుతున్నాయి. ఇంటి మీద పెద్ద రాయి పడి, ఇల్లు పడుతుందా అన్నంతగా శబ్దం చేసింది.

గోవిందుకనిపించటం లేదు.

పగిలిన రాళ్ళు రవ్వలై పైకి లేస్తున్నాయి.

దీపావళి నాడు చిచ్చు బుడ్డి రవ్వలు చిమ్మి నట్లుబావి రాళ్ళు చిమ్ముతూ ఉంది.

ఉన్నట్టుండి మళ్ళీ శబ్దం. ఓటికుండ పగిలినట్లు మోత. రాళ్ళు లేవలేదు. శబ్దం ఘనంగా లేదు.

పిచికారీ కొడితే నీళ్ళు చిమ్మించి కొట్టినట్టు బావిలోనుంచివేప చెట్టు ఎత్తుదాకా శబ్దంతో పాటునీళ్ళు. ఒక్కసారి, మెరుపుమెరిసినట్లు ఎగిరిపడ్డాయి. ఫౌంటేన్ చిమ్మినట్లు ఒక్కక్షణకాలం అనిపించింది.

ఆరు తూటాలు పేలటం ఆగిపోయింది. అతను బైటికి వచ్చేసరికి బావి చుట్టూ నిశ్శబ్దం రాజ్యంచేస్తూ ఉంది. అంతాదాకా ఉన్న శబ్దం ఇష్టమయింది. ఆ నిశ్శబ్దమూఇష్టంగా ఉంది. గోవిందు కనిపించలేదు.

వినాయక్ కళ్ళూ, కాళ్ళూ గోవిందు కోసం వెదుకుతున్నాయి.

గోవిందు కనిపించలేదు. అతడి భార్య కనిపించలేదు. కొడుకు కనిపించలేదు. అతన్ని నక్కలా ఆగిపోయిన మనుషులు ముందుకు వస్తున్నారు. బావి చుట్టూ చేరుతున్నారు. బావిలోంచి లేచి పడ్డరాళ్ళు రవ్వలులాగా చిందరవందరగా జనం.

భాగీరథి పిల్లలు. బీబీ వెలుపలికి వచ్చారు. అందర్ని అందరూచూస్తున్నారు. గోవిందు కోసం చుట్టూ చూస్తున్న అతనికి జమ్మి చెట్టు కింద, పాముల పట్టు పక్కనే చెట్టు చుట్టూ కట్టిన అరుగుమీద, గోవిందు కూర్చున్నాడు. ప్రక్కనే భార్య ఉంది. కొడుకున్నాడు.

పరుగు పరుగున పోయిన వినాయక్ ఏమయిందేమయింది. అన్నాడు.

'ఏవీ కాలేసావీ' అన్నాడు గోవిందు. కట్టుకొన్న పంచ ఎర్రగా ఉంది. నెత్తురు మరక!

'ఏందీ నెత్తురు!' అతను కంగారుగా ఉన్నాడు.

'ఏంది స్వావీ నువ్ గూడ'క్ అని మొదటి తూటా పేలటం, పెద్దరాయి ముక్క లేవటం, ముడ్డికి తగలటం, అది మనిషిని ఎత్తి గట్టున పడేయటం దాని దెబ్బకు పిర్రలు పగలటం, నెత్తరు రావటం చెప్పాడు.

ముడ్డీ, ముడ్డి మీద బట్ట చీలికలు పీలికలు అయిపోయాయి. నెత్తురుకారుతూ ఉంది. వద్దన్నా వినకుండా గోవిందుకు నడుంమీద, మోకాళ్ళకు పైనకట్టు గట్టాడు. నెత్తురు కారుతూనే ఉంది. వినాయక్ ఏడుస్తున్నాడేమో ఎవరికీ తెలియదు. ముక్కు చీదుతున్నాడు.కళ్ళు తుడుచుకుంటున్నాడు.

"యాంది సావీ యాందయిందబ్బా యెందుకిట్టా సుడీ. ఇదేంది మనిషి యాడవొద్దు సావీ" నాకేందీ గాలా సుడీ, లేచినిలబడ్డాడు. జనం చుట్టూ పొగయ్యారు.

"హాస్పిటల్‌కి పోదాం. డాక్టరును కలుద్దాం."

"ఆసుపత్రికెందుకు సావీ సుడీ సిటికిలో పాయ"

వినాయక్‌కి నమ్మకం కలిగించటానికి గోవిందు నడవసాగాడు. కుంటుతూనే ఉన్నాడు. ఎవరెవరో ఎదురొస్తున్నారు. ఏమేమో చెబుతున్నారు. అతనేమీ వినటం లేదు. గోవిందునే చూస్తున్నాడు.

అతడినడక మామూలుగా లేదు.

"నీ బిడ్డల కట్టాలిట్టా తీరినాయ సావీ"

'అయితోడి పారబొయ్యాల్ల' ఎవరేవరో ఏమోమో అంటున్నారు.

ఎవరూ తోడి చూచి శుభ్రం చేయలేరు. ఆ బావిలో గోవిందు చెమట ఉంది.రక్తముంది. కన్నీరుంది.అది పెద్ద ఊట. దానికి అడ్డం లేదు. అంత పెద్దజల. పిడికిలి అంత రంధ్రం. బండ పగిలికన్న పడి నీరుపైకి ఎగదన్నింది. మూడు నిలువుల నీరొచ్చింది.

గోవిందు భార్య కడవతో నీళ్ళు తోడి కడవకు కడవ తెచ్చింది.

"నీల్లు తాగు సావీ"

"నువ్వు తాగు" అని కడవ నోటి దగ్గర పెట్టాడు. చేయి అడ్డం పెట్టుకొని గోవిందు తాగాడు. దాహం తీరేదాకాతాగాడు. సగం కడవతాగినట్లు తాగాడు. పక్కకు పడ్డ నీళ్ళతో గోవిందుముఖం కడిగాడు వినాయక్. నీళ్ళు తాగుసావీ అంటూనే ఉన్నాడు గోవిందు. కడవలో మిగిలిన నీళ్ళు అతను తాగబోతుంటే గోవిందు వారించాడు.'నా యంగిలి సావీ మారాజా.'

"నీఎంగిలేమిటి నా ఎంగిలేమిటి? నీటికి ఎంగిలిలేదు. గంగకు ఎంగిలి లేదు. నీ ఎంగిలని నేను మానదలిస్తే చేస్తే బావిని వాడుకోరాదు. బావి అంతా నీ ఎంగిలే! నీ చెమటే! నీ నెత్తురే నీ కన్నీరే నీ బీడి ముక్కలే! నీ బీడీ బూడిదే! నేలే మట్టే అయినా గంగ పవిత్ర.' 'అతను కడవలో నీళ్ళు తాగుతుంటే గోవిందు. అతడి భార్య కొడుకు ఆశ్చర్యంగా చూస్తూ

నిలబడ్డారు. ఇంట్లో వాళ్లందరూ, వస్తూపోతూతొంగిచూచిన వాళ్ళందరూ నీళ్ళు తాగారు.

టెంకాయ నీళ్ళన్నారు. గంగన్నారు. అమృతమన్నారు.

వినాయక్ బావిలోకి చూశాడు. అది నిండుకుండలాగా తొణికిసలాడుతూ ఉంది. నెలలు నిండిన మనిషిలా బరువుగా ఉంది.అమ్మలాగా అప్యాయంగా భూమిలాగా ఓర్పుగా ఉంది. భూదేవి ప్రేమలాగా తల వూపుతూఉంది.గంగాభవాని పైకి వరంలాగా వస్తూ ఉంది.

"ఈ బాయి ఎప్పటికీ వొట్టి పోదుసావీ రాతి బండల నడిమి నీల్లు!"

బావిని చూస్తే ఆనంధం. గోవిందును చూస్తే బాధ. వినాయక్ కళ్ళనిండా నీళ్ళు. ఈ కన్నీరు. ఆనందం దు:ఖం రెండింటిని చెబుతుంది.

నీళ్ళు తాగిన వినాయక్ ముఖం పెద్ద కొడుకు తుడుస్తుంటే రిక్షాను పిలుచుకొని రమ్మన్నాడు తండ్రి కొడుకు చేయి ముద్దాడుతూ.

ఈ ఇంటి ఇల్లాలు పేరు భాగీరథి. ఇంటి పేరు నాప బండ మీద భాగీరథి ఉంది. ఈ ఇంట్లో మునుపు గంగ లేదు. ఇక ఉంటుంది.

నీళ్ళుంటే మనుషులు శాంతచిత్తులవుతారు. తపోవనంలో ప్రశాంతి ఉంటుంది. చెట్లు మొలుస్తాయి. పెరుగుతాయి. పెద్దవవుతాయి.

నారాయణపురంలో నరనారాయణులిద్దరూ నివసిస్తారు. అనంతపురం వస్తూ పోతూ ఉంటారు.

నీళ్ళుంటే అనంతపురం అనంత సంపన్నమేకాదు. ఐహిక్మంగా, ఆముష్మికంగా అనంత సౌందర్యమవుతుంది.

భాగీరథిలో నుంచి బైటికి వచ్చిన చిరంజీవులు తపోవనం నుంచి బయలుదేరి నారాయణపురం బాటలో భవిష్యత్తును వెదుక్కొంటూ అదృష్టవంతులై అనంతపథగాములై అనంతపురం చేరుకుంటారు.

పెద్దకొడుకు రిక్షాతో వచ్చాడు. గోవిందును అతడి భార్యను, కొడుకును రిక్షాలో కూర్చోపెట్టుకొన్న వినాయక్ సైకిల్ మీద అనంతపురం తీసుకొని పోతున్నాడు. సూర్యుడుకూడేట్లో కుంకుతూ ఉన్నాడు. ఇదేసూర్యుడు మళ్ళీ రేపు దేవరకొండై ఉదయిస్తాడు.

సైకిలూ,రిక్షా, డాక్టరు కోసం అనంతపురం వైపు సాగిపోతున్నాయి.

★